honeybee.org
Vol-9 Issue-3

సంపుటి 9 సంచిక 3 మార్చి - ఏప్రిల్ 2021

# పల్లెసృజన

www.pallesrujana.org

## గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక



# నీలం రంగు ట్రాఫిక్ లైట్!



ఈ శీర్షిక చూసి ఆశ్చర్య పోయారా? ఆశ్చర్య పోలేదు అంటే మీరు ప్రపంచంలో దేన్ని కూడా మనసు పెట్టి ఆలోచించడం లేదన్నమాట. ప్రపంచంలో అతి భిన్నమైన లేదా ప్రత్యేకమైన విషయం ఏదైనా కూడా మిమ్మల్ని కదిలించలేక పోతోంది అంటే మీరు ప్రపంచంలో అన్నిటినీ సమానంగా చూసే స్థిత ప్రజ్ఞులు అనుకోవాలి. 2013లో మొట్టమొదటి సారి ఈ విషయం నా దృష్టికి వచ్చినపుడు నేనూ చాలా ఆశ్చర్యపోయాను. అప్పుడే అనిపించింది బీహార్‌కి చెందిన ఒక చిన్న పిల్లవాడికి ఒక జటిలమైన సమస్యకి ఇంత సులభమైన పరిష్కారం ఎలా తట్టిందా! అని. అదే అడిగాము అతన్ని. దానికతను "నా పేరు ఆదర్శ్ భరణ్ వాల్ కతిహార్. నేను రోజూ మన చుట్టు ప్రక్కల వుండే రోడ్లమీద ట్రాఫిక్ జామ్‌లని చూస్తూ వుంటాను. అప్పుడు నాకు అనిపించేది, ముందు ట్రాఫిక్ వున్నది అని సూచిస్తూ ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర ఒక నీలం రంగు లైటు ఏర్పాటు చేస్తే బావుంటుంది అని. దాన్ని చూసిన వాహనదారులు అవసరమనుకుంటే కుడి వైపుకో లేదా ఎడమ వైపుకో వెళ్ళిపోయి, ఎదరన వున్న ట్రాఫిక్ జామ్‌ని తప్పించుకునే అవకాశముంది" అన్నాడు. ఒక్కసారి ఊహించండి. ఇదే సిద్ధాంతం ప్రపంచ వ్యాప్తంగా అమలు చేస్తే ఎంతమందికి మేలు జరుగుతుందో. అప్పుడు ఇంత మందికి మేలు చేసే ఈ చిన్ని ఆలోచన భారతదేశంలో మారుమూల ప్రాంతానికి చెందిన ఒక చిన్న పిల్లవాడికి వచ్చింది అని తెలిస్తే మనందరికీ ఎంత గర్వంగా వుంటుంది.

ఇటువంటి ఆలోచనలని ఏవిధంగా అమలు చేయాలి? చిన్నవైనా ఇటువంటి మంచి ఆలోచనలని ప్రయోగాత్మకంగా ఒక చిన్న ప్రాంతంలో ప్రారంభించాలి అనుకుంటే దాన్లో వున్న ఇబ్బందులేమిటి? అందరూ ఆలోచించుకోవాలి. ఈ ఆలోచనని పరీక్షించే దశలోనే వున్నాం. సమీప భవిష్యత్తులోనే ఈ ఆలోచనని అమలు చేస్తే వచ్చే పర్యవసానం గురించి తెలిసే అవకాశం వుంటుందని కోరుకుంటున్నాం. అదేవిధంగా ఎన్నో సమాధానం లేని ప్రశ్నలకి తమ చిన్ని ఆలోచనలతో పరిష్కారం కనుగొనేలా పాఠశాల విద్యార్థులని ప్రోత్సహించాలని కోరుకుంటున్నాం. మనం సాధ్యమైన వాటినే ప్రోత్సహిస్తూ, కొంచెం అసాధ్యంగా కనిపించే వాటిని కూడా ప్రోత్సహించటం అలవాటు చేసుకోవాలి.

మనం చిన్న పిల్లల నుంచి అప్పటికప్పుడు వచ్చే ఆలోచనలను ఆచరణ యోగ్యంగా లేవు అని కఠినమైన నియమాలు పెట్టి, వాళ్ళలోని సరళమైన ఆలోచనా విధానాన్ని చంపేస్తున్నాము అనిపిస్తుంది. ఈవిధంగా చేయటం లేదు కనుకనే 'ఇగ్నైట్ పురస్కారాలు' ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నాయి. మా యీ ఆలోచనని బలపర్చే విధంగా ఇకనుంచి పాఠశాల విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలని పాఠశాల ఉపాధ్యాయులు లేదా ప్రధానోపాధ్యాయుల సిఫారసు, అనుమతి లేకుండా నేరుగా నేరుగా నేరుగా పంపించవచ్చు. ఇటువంటి పునాది స్థాయి ఆలోచనలకి ఎంతో ప్రాధాన్యతనిచ్చి ప్రోత్సహించిన మన మాజీ రాష్ట్రపతి దివంగత శ్రీ ఎపిజె అబ్దుల్ కలాం గారి పుట్టిన రోజైన అక్టోబర్ 15వ తేదీనాడు ఈ ఆలోచనలలో ఎంపికైన వాటికి బహుమతి ప్రకటించటం జరుగుతుంది. అందువల్లనే ఈ పురస్కారాలకి "డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం ఇగ్నైటెడ్ మైండ్ చిల్డ్రన్ క్రియేటివిటీ & ఇన్నోవేషన్ అవార్డ్స్" అని నామకరణం చేయటం జరిగింది. దీని వివరాలు ఈ సంచిక 7వ  పేజిలో చూడవచ్చు.

(2014వ సంవత్సరంలో ఎన్ఐఎఫ్ వారు నిర్వహించిన 'ఇగ్నైట్' పురస్కారాలలో 'ఆదర్శ్' స్వయానా అబ్దుల్ కలాం గారి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నాడు.)

**– హనీబీ 31 (1-2) జనవరి-జూన్ 2020**

Vol-9, Issue - 3 March - April 2021

## విషయ సూచిక

# పల్లెసృజన

సంపుటి-9 సంచిక - 3 మార్చి - ఏప్రిల్ 2021

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్– 500 094.
ఫోన్ : 040–27111959, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit :www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సంపాదకులు :
**జమ్మలమడక శశిమోహన్**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త**
**పి. చంద్రకాంత్ శర్మ**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్**
**జమ్మలమడక శ్రీకర్**
**కల్పనా శాస్త్రి**

కార్టూన్స్ : **వెంకట్**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్**, హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail :
narendragrafixhyd@gmail.com

**Rs. 1,000/-**
**for 5 years Subscription**



మొక్కజొన్నలో అంతర సేద్యానికి చవకైన పరిష్కారం చూపిన గ్రామీణ ఇన్నోవేటర్ వెంకటయ్య 4


ఇతర రాష్ట్రాల పల్లె జ్ఞానం 21


10వ ద్వైవార్షిక పోటీ విజేతలు 8

సురపాలుని వృక్షాయుర్వేదం 24


ఫాం పాండ్‌లో ఆవిరయ్యే నీటిని తగ్గించే సులభ పరిష్కారం 12


సిద్ధాంతం శ్రీనివాస రావు రూపొందించిన తక్కువ ఖర్చుతో ఎక్కువ పనిచేసే ఇసుక ఫిల్టర్ 26


మీ సమస్య – పల్లెసజన పరిష్కారం 14


ఆయుర్వేద జ్ఞాన మథనం– వడదెబ్బ నుండి కాపాడుకోవటమెలా? 30


జాతీయ బహుమతి పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు 18


స్పందన 32

**కవర్ లోపలి పేజీల్లో ...**
నీలం రంగు ట్రాఫిక్ లైట్ ! – హనీబీ కథ
అమ్మకానికి సిద్ధంగా వున్న రైతుల కోసం రైతుల ఇన్నోవేషన్లు

**మధ్య పేజీలో :**
ఫిబ్రవరి – మార్చి మాసాల్లో 'పల్లెసృజన' కార్యక్రమాలు


Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix,** 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State, Editor : **J. Sesimohan.**

## HoneyBee Regional Collaborators & Publications

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank, Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Num Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

# 'గ్రామాల స్వయం సమృద్ధి' దిశగా "యూ టర్న్"

మహాత్మా గాంధీ "గ్రామాలు మన దేశానికి పట్టుకొమ్మలు" అన్నారు. ఆయన మన గ్రామాల అప్పటి ఆత్మ నిర్భరత, స్వయం సమృద్ధిని పూర్తిగా అర్థం చేసుకొని అలా అన్నారు. ఆహారం, ఆవాసం, పని, ఆరోగ్యం, జ్ఞానం, సహజీవనం, ప్రకృతితో సంయమనం, పశు పక్ష్యాదులను ఆదరించడం, నేర్చుకోవాలన్న కుతూహలం, సాధించాలన్న ప్రయోగాత్మక తత్వం – ఇవన్నీ కలిగివున్న గ్రామాల గురించే గాంధీజీ అలా ఉటంకించారు. వాటి అప్పటి ఆంతర్‌శక్తిని కాపాడుతూ ఆధునీకరణను గ్రామాల్లో అమలు చేయాలని సూచించారు. నిజంగా చెప్పాలంటే మా చిన్నప్పుడు చనిపోయేవాళ్ళు పెద్దవాళ్ళే. ఆకాల మరణాలు అసలు ఉండేవి కావు. పెద్దవాళ్ళు చనిపోతే గౌరవంగా ఊరంతా వారిని సాగనంపేవారు. ఏ ఇంట్లో శుభం కాని, అశుభం కాని ఊరంతా పాల్గొనేవారు. ప్రతి పనికి నియమితమైన మనుష్యులు ఉండేవారు. ఆఖరి నిమిషంలో వెతకాల్సిన అవసరం లేకుండా ఊరంతా ఒకటై కష్ట సుఖాల్లో సహాయం చేసేవారు. గ్రామాలు ప్రధానంగా ప్రకృతి పునరుత్పత్తిపై ఎక్కువగా ఆధారపడేవి. మనుష్యుల ద్వారా ఉత్పత్తి తక్కువగా ఉండేది. పుష్కలంగా బావుల్లో, చెరువుల్లో నీళ్ళు సంవత్సరాంతము ఉండేవి. నీటి కొరత పశుపక్ష్యాదులకు, మనుష్యులకు ఉండేది కాదు. మనుష్యులు, పశువులు, పక్షులు రోజూ ఆనందంగా స్నానాలు చేసేవి. ఆరోగ్యంగా ఉండేవారు. గ్రామ ప్రజలకు, వారు పెంచుకున్న పశువులకు, కోళ్ళకు, పందులకు, గాడిదలకు, బాతులకు, కుక్కలకు తగినంత ఆహారం ఊళ్లోనే లభ్యమయ్యేది. అవసరాలకై ఆధార పడటం తెలియని గ్రామాలు తలెత్తుకుని ఎంతో ఆత్మగౌరవంతో, ఆత్మ విశ్వాసంతో మనుగడ సాగించేవి. గాంధీగారు గ్రామాల్లోని ఈ అద్భుత ఆచారాలను, జీవన విధానాన్ని కాపాడాలని పదే పదే చెప్పారు. అలాంటి గ్రామాలు ఎక్కడున్నాయి? ఎలా మారిపోయాయి? ఎందుకు మారాయి? స్వయం సమృద్ధి ఎక్కడ మాయమైంది? ఆత్మ నిర్భరత నుండి ఆఉద్భవించే ఆత్మ విశ్వాసం, ఆత్మ గౌరవం కనిపించకుండా పోయాయి.



ప్రస్తుత గ్రామాలు, గ్రామ ప్రజలు, రాజకీయ, ఆర్థిక, పారిశ్రామిక శక్తుల చేతుల్లో కీలు బొమ్మలయ్యారు. ఆర్థిక, వాణిజ్య వ్యవస్థకు పూర్తిగా బానిసలయ్యాయి. చెప్పుకోవడానికి, వినడానికి ఎవ్వరూ లేరు. అందరూ గ్రామస్తులకు చెప్పేవారే. వారి అనుభవంతో వచ్చిన జ్ఞానాన్ని, తరతరాలుగా వస్తున్న సాంప్రదాయ జ్ఞానాన్ని, ప్రకృతితో పశు పక్ష్యాదులతో వారికున్న సంయమన జీవన విధానాన్ని అడిగినవాళ్ళు లేరు. ఆ జ్ఞాన మహత్తును గుర్తించినవాళ్ళు లేరు. దాన్ని గ్రంథస్తం చేసే ప్రయత్నాలు లేవు. ఈ విధంగా మన స్థానిక అపార జ్ఞానాన్ని నిర్లక్ష్యం చేసి ఆధునిక విజ్ఞానంతో నింపేశారు. కొత్తది అతకక, పాతది లేకుండా గ్రామ ప్రజలు త్రిశంకు స్వర్గంలో జీవిస్తున్నారు. సంప్రదాయ జ్ఞానానికి దూరం అయ్యారు. ఆధునిక విజ్ఞానం ఎప్పుడూ ప్రయోగభరితంగా ఉండటం వలన గ్రామస్తుల జీవన వృత్తులు అతలాకుతలం అయ్యాయి. అన్ని అవసరాలకు గ్రామస్తులు దిగుమతులపై (గ్రామం బయటి నుండి) ఆధార పడుతున్నారు. ద్రవ్య వ్యవస్థ శరాఘాతంగా గ్రామ ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నది. రైతులే వ్యాపారులు కావాలని, దళారీ వ్యవస్థ మాయమవాలన్న ఆలోచనలతో ప్రభుత్వాలు, సాంఘిక సంస్థలు రైతులను వ్యాపారులుగా మారుస్తున్నారు. ఇది ఎన్నటికి సాధ్యం కాదు.

**కిం కర్తవ్యం ??**

గ్రామ స్వయం సమృద్ధి దిశలో గ్రామాభివృద్ధి ప్రణాళికలను పునః నిర్వచించాలి. "యూటర్న్" అత్యవసరం. 20వ శతాబ్దంలోని మధ్య దశాబ్దాలలో ఉన్న గ్రామ వనరులను పునరుద్ధరించాలి. పుష్కలంగా నీరు పునరోత్పత్తి చేసే అడవులు, పక్షులు, జంతువులు, పశువులు తిరిగి రావాలి. వారి అవసరాలకు గ్రామాలు తామే పండించుకొని తినాలి. పశువుల పోషణ గ్రామంలోని వనరులతో జరగాలి. అవసరాలకై దిగుమతులు మెల్లిమెల్లిగా పూర్తిగా తగ్గించాలి. మా చిన్నతనంలో (అంటే 70వ దశాబ్దం

వరకు) మా గ్రామంలో దిగుమతులు ముఖ్యంగా మూడు ఉండేవి. ఉప్పు, అగ్గిపెట్టె, కిరోసిన్ ఆయిల్. అలాంటి ఆనందమయ ఆత్మ నిర్భర స్థితికి గ్రామాలను పునరుద్ధరించాలి. ఆహారం, ఆరోగ్యం, పశుగ్రాసం, వ్యవసాయానికి కావలసిన పెట్టుబడులు, సామాన్య సాంకేతికతతో పండించిన పంటలను ఉపయోగ యోగ్యంగా చేయటానికి యంత్రాలను, గ్రామాల్లో విరివిగా లభ్యమయ్యే సౌర కాంతి, వాయువు, జీవ పదార్థాలపై ఆధారపడే యంత్రాలను గ్రామస్తుల అవసరాలకు తగినట్టుగా డిజైను చేసి లభ్యమయ్యేట్టు చేయాలి. గ్రామ దిగుమతులను సాధ్యమైనంత వరకు 2–3 సంవత్సరాలలో తగ్గించేయాలి. గ్రామ ఎగుమతులకు పూర్తి మద్దతునిచ్చి, వారి ఉత్పత్తులకు మార్కెట్‌కు యోగ్యంగా గ్రామాల్లోనే తయారు చేయటానికి అన్ని సౌకర్యాలు, శిక్షణ లభ్యం చేయాలి. ఎగుమతులు మెల్లిమెల్లిగా పెరగాలి. అమ్మకాలు 100 కి.మీ. పరిధిలోని వినియోగదార్లకే అమ్మాలి. దీంతో శీతల గిడ్డంగులు, శీతల వాహనాల అవసరం ఉండదు. గ్రామాల్లోని ఉపయోగించని వనరులను, ప్రజల నైపుణ్యాలను ప్రోత్సహించాలి. ఊరి సంపదను పెంచే ప్రణాళికలు వేయాలి. ప్రకృతి ఏటా ప్రసాదించే నీటిని తగిన విధంగా నిల్వ చేసుకోవటం గ్రామ సంపద అభివృద్ధికై తగు రీతిగా పంటలను గుర్తించి నీటిని వాడటం, భూతలంపై నీరు సంవత్సరాంతం, ప్రజలకు, పశుపక్ష్యాదులకు లభించేలా చేయటం, వ్యవసాయానికి కావలసిన పెట్టుబడులు – విత్తనాలు, నీరు, ఎరువులు, విద్యుత్తు, వ్యవసాయ కూలీలు, వగైరాలన్నీ ఊళ్ళోనే లభ్యమయ్యేట్టుగా చేయడం, పశువులను, చెట్లను, అడవులను, కాపాడుకోవటమే కాక, వాటి సంఖ్యను ఎక్కువ చేసి, వాటి "పునరుత్పత్తి"తో సదా లాభం పొందడం, ప్రకృతి పునరుత్పత్తి గ్రామ ప్రజల అవసరాలకంటే ఎక్కువగా ఉండేవిధంగా నిర్ధారించడం – ఇలా "యూటర్న్" మానసికతతో ప్రకృతి ఆధారిత జీవనాన్ని ప్రధానంగా గ్రామ ప్రజలు అలవాటు పడేలా చేయడం జరగాలి. ప్రతి గ్రామాన్ని ఒంటిగా 'స్వయం సమృద్ధి' చేయడం సాధ్యం కాకపోవచ్చు. 20–30 గ్రామాలను ఒక 'సమూహం'గా గుర్తించాం ఆ గ్రామ సమూహాన్ని "స్వయం సమృద్ధి" దిశగా నిర్దేశించడం జరగాలి.

రైతు పని రైతు చేయాలి. వ్యవసాయం వరకు రైతు, బట్ట నేయటం వరకు నేతన్న, చేపలు పట్టే వరకు మత్స్యకారుడు పరిమితం కావాలి. ఆ తర్వాత ఉత్పత్తి చేసిన వారికి వారి అభివృద్ధికి అనుగుణంగా ప్రతిఫలం ఇచ్చి వ్యాపారం సమాజంలోని చదువుకున్న, ఆర్థిక వ్యవస్థతో నైపుణ్యమున్నవారు చేపట్టాలి.

ఈ కార్యాన్ని స్థానిక ప్రజలే చేయాలి. వారికి అన్ని సహాయ సహకారాలు వ్యవస్థ అందించాలి.

**గ్రామాలపై మనం పడాల్సింది "జాలి కాదు – గర్వం".**

**వారికి కావలసింది చేయాలి కాని మనకు తోచింది కాదు.**

**వారి జ్ఞానానికి, ప్రావీణ్యతకు తోడు చేయడం ఆధునికీకరణ కాని, వారి జ్ఞానాన్ని నిర్లక్ష్యం చేయడం ఆధునికీకరణ కాదు.**

పల్లెసృజన కొన్ని గ్రామాల్లో "గ్రామ స్వయంసమృద్ధి" పై వాలంటీర్లతో కలిసి ప్రయోగాలు ప్రారంభించింది. ఈ విషయంలో సంప్రదింపులకు పల్లెసృజన ఎల్లప్పుడూ సిద్ధమే.

కరోనా మరోసారి విజృంభిస్తున్నది. గత సంవత్సరంలా కాకుండా, ఈసారి గ్రామాల్లో కోవిడ్–19 కేసులు ఎక్కువ సంఖ్యలో అగుపడుతున్నాయి. స్వీయ రక్షణ, తగు జాగ్రత్తలే మనకందరికీ శ్రీరామరక్ష. అందరూ ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ...

**భవదీయ**

బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)

## పసి పిల్లలను 'పచ్చ కామెర్లు' వ్యాధినుండి కాపాడుకునే సంప్రదాయ వైద్యం

ప్రస్తుత సమాజంలో గర్భిణీ స్త్రీలు ప్రసవించిన వెంటనే పుట్టిన బిడ్డకు 'పచ్చ కామెర్లు' (జాండీస్) వున్నాయని కొందరు డాక్టర్లు వారికి ఔషధాలతో నియంత్రించే ప్రయత్నం చేస్తారు. అలా కాకుండా పుట్టిన బిడ్డలను ప్రతిరోజూ ఉదయం లేత సూర్యరశ్మిలో ఒక గంట పాటు అలాగే సాయంత్రం సంధ్యా సమయంలో తగ్గిన సూర్యరశ్మిలో మరో గంట కాళ్ళపై పడుకోబెట్టుకోవాలి. ఇలా ఒక వారం రోజుల పాటు చేస్తే పసి పిల్లలకు పచ్చ కామెర్ల వ్యాధి తగ్గిపోతుంది. ఇది ప్రకృతి మనకు ప్రసాదించిన వరం.

ఈమధ్య 'పల్లెసృజన' వాలంటీర్ కృపాకర్ గారి మనవరాలికి ఈ ప్రక్రియతో పుట్టిన 7 రోజుల్లో పచ్చకామెర్లు తగ్గిపోయాయి. డాక్టర్లు కూడా నిర్ధారించారు. కృపాకర్ గారి తల్లి (85 సంవత్సరాలు) 'పరమల్లీశ్వరి' ఆప్యాయంగా ఇచ్చిన సలహాకు చిట్టిపాప సునాయసంగాఆరోగ్యవంతం కావడానికి కారణం 'సంప్రదాయ జ్ఞానంపై విశ్వాసమే'.

## మొక్కజొన్నలో అంతర సేద్యానికి చవకైన పరిష్కారం చూపిన

# గ్రామీణ ఇంజనీర్ వెంకటయ్య



- పల్లె వీరరాఘవ రెడ్డి

'పల్లెసృజన' ఇన్నోవేటర్లు ఇప్పటికే చాలామంది ప్రత్తి, మిరప, ఉద్యాన పంటల్లో అంతర సేద్యాల కొరకు వీడర్లను తయారు చేయటం జరిగింది. అలాగే దేశంలోని చాలా ప్రాంతాల్లో ఈ వీడర్లు తయారవుతూ వున్నాయి. మాకున్న సమాచారం ప్రకారం ప్రస్తుతం కార్పోరేట్ కంపెనీలు తయారు చేసే వీడర్లకన్నా, పునాది స్థాయి ఇన్నోవేటర్లు తయారు చేసిన వీడర్లే ఎక్కువగా అమ్ముడు పోతున్నాయి. అయితే మన తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువగా పండించే పంటలలో ప్రధానమైనవి మొక్కజొన్న, వేరుశనగ. ఈ పంటల్లో అంతర సేద్యాలకు ఇప్పటికీ ఎద్దులతోనే చేస్తున్నారు తప్ప వీటికి సరియైన యంత్రాలు రాలేదు. అందువల్ల సరియైన సమయంలో ఎద్దులు లభించక, కూలీలతో కలుపు తీయించుకోలేక మొక్కజొన్న, వేరుశనగ పంటల విస్తీర్ణం చాలావరకు తగ్గిపోయింది. ఈ సమస్యను తీర్చగలిగాడు మన తెలుగు ఇన్నోవేటర్ 'కోయిల కొండ వెంకటయ్య'.

మహబూబ్ నగర్ జిల్లా, హన్వాడ మండలం, చిన్న దర్పల్లి గ్రామానికి చెందిన అనంతయ్య, బాలమ్మల కుమారుడు 39 సంవత్సరాల కోయిల్‌కొండ వెంకటయ్యకు ఒక ఎకరం పొలం వుంది. భార్య, ఇద్దరు కూతుర్లు, ఒక కొడుకు కలిగిన కుటుంబం. కేవలం ఒక ఎకరం పొలంలో ఇంతమంది జీవనం కొనసాగించటం కష్టం కాబట్టి తల్లి, తండ్రి, భార్య వ్యవసాయ కూలీ పనులకు వెళ్తుంటారు, పిల్లలు పెద్దమ్మాయి ఇంటర్ చదువుతుండగా, చిన్నమ్మాయి 9వ తరగతి చదువుతోంది. కుమారుడు 6వ తరగతి చదువుతున్నారు. వెంకటయ్య చదివింది కేవలం 7వ తరగతి వరకు మాత్రమే. గతంలో వెల్డింగ్ పనులు చేస్తూ ఆ రంగంలో మంచి అనుభవం గడించి, తన స్వగ్రామమైన చిన్న దర్పల్లిలోనే ఒక వెల్డింగ్ షాప్ ఏర్పాటు చేసుకుని రైతులకు అవసరమైన పనిముట్లు చేస్తూ తన భృతిని సంపాదించుకుంటూ వుంటాడు. తనకున్న ఎకరం పొలంతో పాటు, కొంత పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయ పనులు



కూడా తానే స్వయంగా చూసుకుంటూ వుంటాడు.

ప్రధానంగా జొన్న, మొక్కజొన్న, మిరప పంటలు వేస్తూ వుంటాడు వెంకటయ్య. ఈ క్రమంలో తన జొన్న పొలంలో అంతర సేద్యాలు చేయటానికి ఎద్దులు కిరాయికి లభించక, పొలంలో కలుపు మొక్కలు పెరిగిపోయి ప్రధాన పంటకు అవరోధంగా మారింది. మొత్తం కలుపును కేవలం తన కుటుంబ సభ్యులు తీయలేరు కాబట్టి కొంతమంది కూలీలను కూడా ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చేది. కూలీల రేట్లు రోజు రోజుకూ పెరిగి పోవటమే కాక, కూలీల లభ్యత కూడా చాలా తక్కువగా వుండేది. స్వతహాగా వ్యవసాయ పరికరాలు వెల్డింగ్ చేసే వృత్తిలో వున్నాడు కాబట్టి దీనికి ఏదైనా పరిష్కారం తానే చేసుకుంటే బావుంటుంది అనుకున్నాడు.

తన వృత్తి రీత్యా కొంత దూరం ప్రయాణం కూడా చేయాల్సి వుంటుందన్న అవసరంతో ఒక పాత టివిఎస్ మోపెడ్‌ను కొని, కొంతకాలం సమీప పట్టణానికి వెళ్ళి, తనకు అవసరమైన సామాగ్రి కొనుగోలు చేయటం లాంటివి చేసేవాడు. కొద్ది రోజులకు తన మోపెడ్ అంతా పాడైపోయింది కానీ ఇంజన్ మాత్రం బాగా పని చేస్తోంది కదా దీనితోనే తన జొన్న పంటలో 'దంతె' పట్టడానికి ఒక చిన్న యంత్రం తయారు చేసుకుంటే బావుంటుందని ఆలోచించాడు. తన వాహనం పాడైపోవటంతో అందులోని ఇంజన్ ను విడదీసి, మిగతా సామాగ్రిని 'గుజిరి' (పాత సామాన్లకు) అమ్మేసి, వచ్చిన డబ్బుతో తన పరికరానికి అవసరమైన సామాగ్రిని కొనుగోలు చేసుకున్నాడు. అంతకు ముందే తన యంత్రం ఎలా వుండాలో ఒక కాగితంపై నమూనా బొమ్మను గీసుకున్నాడు. తాను తయారు చేసే యంత్రం మార్కెట్లో లభించే యంత్రాలకన్నా భిన్నంగా వుండాలి, ఎటువంటి పంటల్లోనైనా సరే అంతర సేద్యాలు చేసేవిధంగా వుండాలి, వీలైనంత తక్కువ ధరలో రైతు కొనగలిగేదిగా వుండాలి అని నిర్ణయించుకున్నాడు.

తాను ముందుగా తయారు చేసిన నమూనా యంత్రంలో తన మోపెడ్ లోని ఇంజన్ మరియు ఒక చక్రాన్ని ఉపయోగించి, మిగతా సామానుతో ఒక చట్రాన్ని తయారు చేసి ఆ చట్రంపైన ఇంజన్ బిగించి, ఒక చక్రం, వెనకాల ఒక అడుగు వెడల్పు గల గుంటక పలుగు, యంత్రం నడపటానికి వీలుగా హ్యాండిల్ ఏర్పాటు చేశాడు. ఈ యంత్రం మొత్తం బరువు 25 కిలోల వరకు వుంటుంది. కాబట్టి సాధారణ శక్తి సామర్థ్యాలు గల మహిళ కూడా దీన్ని సులభంగా నడపవచ్చు. ఇలా తయారు చేసిన తర్వాత తన పొలంలో ప్రయోగాలు చేసి, అందులోని కొన్ని లోటు పాట్లను తన మేధస్సుతోనే పరిష్కరించుకొని మొత్తానికి తాను అనుకున్న విధంగా యంత్రాన్ని తయారు చేసి తన జొన్న పొలంలో అంతర సేద్యం విజయవంతంగా చేసుకున్నాడు. ఆ తర్వాత ఒకటిన్నర అడుగుల వెడల్పు గల గుంటక పలుగు తగిలించుకొని మిరప పంటలో కూడా అంతర సేద్యం చేసుకున్నాడు. ఆ తర్వాత దానికి మూడు గొర్రు కొయ్యలను ఏర్పాటు చేసి, మిరప, కూరగాయల పంటలలో మొదట గొర్రు, ఆ తర్వాత గుంటక వేసి అంతర సేద్యం చేయటం ద్వారా కలుపు కూలీల ఖర్చును 70 శాతం నియంత్రించుకోవటమే కాక, త్వరగా పూర్తి చేయగలిగాడు.

ఈ యంత్రంతో ఒక మనిషి సునాయాసంగా 2 ఎకరాల పొలంలో అంతర సేద్యం చేసుకోవచ్చు. పెట్రోలు ఖర్చు ఎకరాకు ఒకటి నుండి ఒకటిన్నర లీటర్ల వరకు అవుతుంది. సేద్యం చేసే పొలం గట్టిదనాన్ని బట్టి పెట్రోలు ఖర్చు పెరగటం, తగ్గటం వుంటుంది.

వెంకటయ్య తయారు చేసిన యంత్రానికి టివిఎస్ మోపెడ్ ఇంజన్ ఉపయోగించాడు. ఈ ఇంజన్‌లు కొత్తవి



మార్కెట్‌లో లభించటం కొద్దిగా కష్టంగా వుంది. పాత మోపెడ్ కొనాలంటే లభించటం లేదు కాబట్టి దీనికి ప్రస్తుతం మార్కెట్‌లో విరివిగా లభిస్తున్న 'హోండా పెట్రోలు ఇంజన్' ఉపయోగిస్తే ఇంకా కొద్దిగా బరువైన పనులు కూడా చేసుకోవచ్చు అని ఆలోచిస్తున్నాడు.

మొత్తానికి సామాన్య రైతు కూడా కొన గలిగేలా ఈ యంత్రాన్ని 25 వేలకే అందించాలన్న తన తపన నెరవేరింది. ఇతని యంత్రం పనితనాన్ని చూసి చుట్టుపట్ల రైతులు తమ ఇంజన్‌లను ఇచ్చి ఇప్పటికి 25 వరకు యంత్రాలను వెంకటయ్యచేత తయారు చేయించుకొని ఆనందంగా తమ పొలాల్లో అంతర సేద్యాలు చేసుకుంటున్నారు.

వెంకటయ్య ఇప్పటికే గ్రామంలోని రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లు తయారు చేసియిచ్చే పనిలో వుండటం వల్ల ఆ అనుభవంతో ఈ యంత్రం ఎంతో నైపుణ్యంగా తయారు చేశాడు. ఆ గ్రామంలోని రైతులకు అవసరమైన పనిముట్లను తన సృజనాత్మకతతో వినూత్నంగా తయారు చేసి, వారి అవసరాలను తీర్చటం అంటే వెంకటయ్యకు ఎంతో సంతోషం.

కొంతమంది రైతుల వద్ద పాత 'టివిఎస్' మోపెడ్‌లు మూలపడి వున్నాయి. మోపెడ్ పాడై పోయి వుంటుంది కాని వాటి ఇంజన్‌లు బాగానే వుంటాయి. ఇంజన్‌ను మోటార్ సైకిల్ మెకానిక్‌ల వద్దకు వెళ్ళి రీబోర్ చేయించుకుని, ఇన్నోవేటర్‌కు అందించినట్లయితే కేవలం 10 వేల రూపాయల్లో మీరు స్వంతంగా తయారు చేయించుకోవచ్చు.






తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'ఇంటింటా ఇన్నోవేటర్' కార్యక్రమంలో వెంకటయ్య యంత్రాన్ని, దాని పనితనాన్ని చూసి వ్యవసాయ అధికారులు, మంత్రి కెటీఆర్ గారు అభినందించి సత్కరించటం జరిగింది. తెలంగాణ ప్రభుత్వ సహకారంతో భారతదేశ ఆర్థిక రాజధాని ముంబాయ్‌లో ఏర్పాటు చేసిన ఇన్నోవేషన్ల పోటీలో వెంకటయ్య తయారు చేసిన 'ఏక చక్ర వీడర్' ఎంపిక కావడం, ఇతన్ని ముంబాయ్‌కి పిలిపించి సత్కరించటం కూడా జరిగింది.

తనకు తగినంత ఆర్థిక స్థోమత కలిగిస్తే ఈ యంత్రాన్ని ఇంకా తక్కువ ధరలో రైతులకు లభ్యమయ్యేలా, ఇంకా బరువైన పనులను కూడా సులభంగా చేసుకుని, ప్రతి రైతు కొనవలసిన యంత్రంగా తయారు చేస్తానని అంటున్నాడు వెంకటయ్య.


వెంకటయ్య చేసిన ఈ యంత్రాన్ని 'పల్లెసృజన' తన ఇన్నోవేషన్ల ప్రదర్శనలో ఏర్పాటు చేయటంతో ఎంతోమంది రైతులు, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, వ్యవసాయ అధికారుల ప్రశంసలు అందుకొంది. వెంకటయ్య తన యంత్రాన్ని ఇంకా అభివృద్ధి చేసి, రైతులకు అందుబాటులోకి తీసుకు రావటానికి 'పల్లెసృజన' తన ప్రయత్నాలను కొనసాగిస్తున్నది. జాతీయ స్థాయిలో తగు గుర్తింపుకై కూడా ప్రయత్నిస్తున్నది.

**ఇన్నోవేటర్ వెంకటయ్య ఫోన్ నెం. : 90306 56573.**

### పిల్లలు తమ తెలివి తేటలతో బహుమతి గెలుచుకునే అవకాశం!

### సృజనశీలురైన పిల్లలకి డా. ఎ.పి.జె. అబ్దుల్ కలామ్ గారి పేరున

# “ఇగ్నైటెడ్ మైండ్” పోటీలు



*...... పిల్లలని మన ఉపదేశాలు వినే మర బొమ్మలుగా కాక స్వంత ఆలోచనలున్న వారిగా తీర్చి దిద్దండి.*

**మీకు 19 సంవత్సరాలకన్న తక్కువ వయస్సు ఉండి దైనందిక సమస్యలకు పరిష్కారాలు చూపే సాంకేతిక ఆలోచనలు ఉంటే వాటిని ignitedmind@honeybee.org ద్వారా వెంటనే మాకు పంపండి.**

మీ ఆలోచన పని చేస్తున్నది లేనిది నిరూపించే ఋజువు/ నమోనా మీవద్ద లేకపోయినా ఫరవాలేదు. ఉంటే బహుమతి గెలుచుకొనే అవకాశాలు మెరుగు పడతాయి. పిల్లల తల్లిదండ్రులకి, అధ్యాపకులకు ఒక విన్నపం. దయచేసి మీ ఆలోచనలు పిల్లల పేరున పంపకండి. మీకై ప్రత్యేకంగా వేరే పోటీలున్నాయి. వాటి వివరాలు HBNCRIIA@honeybee.org వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

పిల్లలు తమ స్వంత ఆలోచనలని ఎవరి సహాయం లేకుండా వారే పంపేవిధంగా ప్రోత్సహించండి.

www.csir.res.in   www.sristi.org   www.gian.org

# 10వ జాతీయ ద్వైవార్షిక పోటీ విజేతలు




**ఎన్.ఐ.ఎఫ్. వారు 2019లో నిర్వహించిన 10వ జాతీయ స్థాయి ఇన్నోవేషన్ మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో జాతీయ బహుమతి పొందిన విజేతల వివరాలు**

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి వ్యాసాలకు స్వేచ్ఛానువాదం : జమ్ములమడక శశిమోహన్

### రాష్ట్ర స్థాయి పురస్కారం – మహారాష్ట్ర
### మెకానికల్ సెన్సార్ సహాయంతో భూమి దున్నే పరికరం

**పేరు : ఘన్‌శ్యాం జాదవ్,**

నివాసి : నాసిక్, మహరాష్ట్ర.



మహారాష్ట్రలోని నాసిక్‌కు చెందిన 34 సంవత్సరాల ఘన్‌శ్యాం జాదవ్ తన కుటుంబాన్ని పోషించే బాధ్యత చేపట్టడం కోసం 12వ తరగతితో చదువు ఆపేశాడు. ఉమ్మడి కుటుంబంలో జీవించే జాదవ్ తన కుటుంబ వ్యాపారమైన నాగలి, కల్టివేటర్లు, గుంటక లాంటి వ్యవసాయ పరికరాలు తయారు చేసి, రిపేరు చేసే పనిలో వుండేవాడు.

తమ చుట్టు ప్రక్కల ప్రాంతంలో చాలామంది సేంద్రియ వ్యవసాయం చేపట్టడంతో ఆధునిక వ్యవసాయ పద్ధతులైన అంతర సేద్యంలో పని చేసే పరికరాలు చాలా అవసరం అని గుర్తించాడు. ఆ తరువాత అతను మెకానికల్ సెన్సార్ల సహాయంతో తక్కువ ఖర్చుతో చవకగా పొల దున్నే పరికరం కనుగొనటానికి ప్రయత్నాలు మొదలెట్టాడు. కొంత కాలానికి ట్రాక్టర్‌కి అనుసంధానం చేసే విధంగా రకరకాల వ్యవసాయ ప్రక్రియలకి అనగా దున్నటానికి, కలియ తిప్పటానికి పనిచేసే డిస్క్‌లు, కలుపు తీయటానికి, గడ్డి కోయటానికి, కన్నాలు చేయటానికి కూడా పనికి వచ్చేలా ఒక పరికరం తయారు చేశాడు. ఈ పనులు చేయగల పరికరాలు చాలా వున్నా, దీని ప్రత్యేకత ఏమిటంటే, దీనిని ఉపయోగిస్తున్నపుడు అడ్డంగా పెద్ద చెట్లు కానీ, వేర్లు కానీ, పెద్ద రాళ్ళు కానీ వచ్చినట్లయితే ఈ పరికరానికే అమర్చిన సెన్సార్లు



వాటిని గుర్తించి, వాటిని తప్పించుకొని పక్కనుంచి వెళ్ళిపోతుంది. దీనివలన వీటికి తగిలి యంత్రం చెడిపోవటం కానీ, విరగి పోవటం కానీ లేదా చెట్టు వేర్లు తెగిపోవటం కానీ జరగదు. కాకపోతే అక్కడ దున్నకుండా వున్న ప్రదేశాన్ని మానవ శ్రమతో సరి చేసుకోవాల్సి వుంటుంది.

ఈ పరికరాన్ని 22 హార్స్‌పవర్‌లు ఆ పైన సామర్థ్యం గల ట్రాక్టర్‌కు అనుసంధానం చేసుకోవచ్చు. ఈ ఉపకరణం సహాయంతో గంటకు ఒక ఎకరంలో పని చేసుకోవచ్చు. దీని ఖరీదు సుమారు రూ. 1,25,000/–లు వుంటుంది.

ఎన్.ఐ.ఎఫ్. వారు తమ 10వ జాతీయ స్థాయి గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలు 2019 కి గాను ఘన్‌శ్యాం జాదవ్‌ను రాష్ట్రస్థాయి పురస్కారంతో సత్కరించడం జరిగింది.

**రాష్ట్ర స్థాయి పురస్కారం - గుజరాత్**

**అభివృద్ధి పరచబడిన చెక్క ఆధారిత సాంప్రదాయబద్ధమైన శవదహన పేటిక**

పేరు : **అర్జున్ భాయ్ యం. ఫగ్దర్**
నివాసం : జూనాగడ్, గుజరాత్



జూనాగడ్, గుజరాత్‌కు చెందిన 56 సంవత్సరాల అర్జున్ భాయ్ ఫగ్దర్ మౌళికంగా గృహ నిర్మాణం, ఇటుకలు చేసే





వ్యాపారంలో వున్నాడు. ఈయన ప్రస్తుతం సామాన్య జనులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి, దానితో పాటు పర్యావరణ పరిరక్షణకై పాటుపడుతూ వుంటాడు. ఈయనకి ఎన్ఐఎఫ్ వారు 2015వ సంవత్సరంలో తమ 8వ జాతీయ స్థాయి గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్‌ల పోటీలలో ఈయన రూపొందించిన ఇటుకలు తయారు చేసే యంత్రానికి బహుమతిని ఇవ్వటం జరిగింది. ఈయన కట్టెలు చీల్చే యంత్రము, గోమయంతో దుంగలు చేసే యంత్రం, కుండలు చేసే యంత్రం, ఎక్కడికైనా తీసుకు వెళ్ళ గలిగే పక్షులకి ఆహారం, నీరు అందించే చెబూత్రా మొదలైన ఎన్నో పరికరాలకు రూపకల్పన చేశాడు.

ఇప్పుడు ఈయన దృష్టంతా మనుషులు చనిపోయిన తర్వాత శవ దహనానికి ఉపయోగించే కట్టెలను ఆదా చేయటం మరియు పర్యావరణాన్ని రక్షించటంపై కేంద్రీకరించాడు. హిందూ ఆచారాల ప్రకారం ఒక మనిషిని దహనం చెయ్యటానికి 400 కిలోల కట్టెలు అవసరం అవుతాయి. ఈ లెక్కన భారతదేశంలో శవ దహనాలకి కొన్ని లక్షల టన్నుల కట్టెలు అవసరం అవుతున్నాయి. దీని కారణంగా మనం అడవులను కోల్పోవటమే కాకుండా, దహన సమయంలో వచ్చే పొగ వలన పర్యావరణ కాలుష్యానికి కూడా కారణం అవుతున్నాం. ఇది గమనించిన అర్జున్ భాయ్ 'వ్యవసాయ వ్యర్థాలు' (బయోమాస్) ను గ్యాస్‌గా మార్చి, తద్వారా శవ

దహనం చేసే ఒక పద్ధతిని రూపొందించాడు. దీనిలో కేవలం శవం పట్టేంత భాగం వేడిమి తట్టుకునే / వేడి వృధా కాకుండా వుండేలా ఇటుకల సహాయంతో ఏర్పాటు చేయబడి వుంది. తల భాగం, కాళ్ళ భాగంలో హిందూ ఆచారాల ప్రకారం కర్మక్రియలు చేసుకొనేందుకు వీలుగా తలుపులు ఏర్పాటు చేయబడి వుంటాయి. పైన మూతకి అత్యధిక వేడిని తట్టుకునేలా 'సెరా ఊల్' (వృధా ఉన్ని) తాపడం వుంటుంది. బయోమాస్ ద్వారా వచ్చే గ్యాస్‌ను అంటిస్తే వచ్చే మంటను నాజిల్ ద్వారా ఒత్తిడితో వెళ్ళటానికి ఏర్పాట్లతో పాటు, బ్లోయర్స్ కూడా ఉన్నాయి. దీని ద్వారా శవ దహనం అతి తక్కువ కాలంలో పూర్తవుతుంది. ఇదే కాక, బూడిద తీసివేయటానికి క్యాస్టిక్ సోడా వాడి, వాతావరణం లోకి చిమ్ని ద్వారా కలుషితమైన పొగ వెళ్ళకుండా ఏర్పాటు చేయబడి వుంటుంది.

సాధారణంగా మామూలు పద్ధతిలో సుమారు 80 కిలోలు వుండే శరీరం దహనం చేయటానికి 400 కిలోల కర్రలు, 3–4 గంటలు కాలాల్సి వుంటుంది. కానీ, అర్జున్ భాయ్ రూపొందించిన శవదహన పేటికలో అదే గంటన్నరలో 80 కిలోల చెక్క సహాయంతో పూర్తి చేసుకోవచ్చు.

దీనివలన సమయము, ఖర్చు, శ్రమ, పర్యావరణ రక్షణ, పర్యావరణ కాలుష్యం కాకుండా నియంత్రించుకోవచ్చు. ఈ పరికరం రూపొందించినందుకు గాను అర్జున్ భాయ్‌కి ఎన్.ఐ.ఎఫ్. వారు తమ 10వ జాతీయ స్థాయి గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలు 2019 లో రాష్ట్రస్థాయి పురస్కారంతో సత్కరించడం జరిగింది.

**రాష్ట్ర స్థాయి పురస్కారం – ఉత్తర ప్రదేశ్**

**అభివృద్ధి పరచబడ్డ చేతి ఊతకర్రలు**



పేరు : **దుర్గాదేవి**

నివాసం : బరేలి, ఉత్తరప్రదేశ్.

ఉత్తర ప్రదేశ్ లోని బరేలి ప్రాంతానికి చెందిన 22 సం.ల దుర్గాదేవి దివ్యాంగురాలైన గృహిణి. కాలి సమస్యతో బాధపడే ఈమె నడవటానికి చేతి ఊత కర్రలు వాడేది. కానీ, తాను ఇంట్లో పని చేసుకునేటపుడు తడిగా వున్న నేలమీద అనేకసార్లు జారి పడిపోయే పరిస్థితే కాక, ఉన్న కాలికి కూడా దెబ్బ తాకే ప్రమాదానికి లోనయ్యేది. అప్పుడు ఆమెకు అనిపించింది. తాను వాడే సాధారణ ఊతకర్రలు గరుకుగా ఉండే నేలపైన, చదునుగా లేని రోడ్లపైన అయితే పని చేస్తాయి కానీ నున్నటి, తడి ప్రదేశాలలో పని చేయవు అని గ్రహించింది. అంతే కాక తాను కొంచెం త్వరగా నడవటానికి ప్రయత్నించినపుడు చంకల నుండి ఊతకర్రలు జారిపోవటం జరుగుతూ వుండేవి. దీనితో నెమ్మదిగా, ఆచి తూచి అడుగులు వేయాల్సి వచ్చేది. ఈ సమస్యపై దృష్టి సారించిన ఆమె తాను వాడే ఊత కర్రలకే మూడు చిన్న చిన్న మార్పులు చేసి, ఎంతో సమర్థవంతంగా పని చేసేలా రూపొందించుకుంది.



అమె చేసిన మార్పులలో మొదటిది – కర్ర చంకలోనుంచి జారిపోకుండా ఒక బెల్టు అమర్చింది. రెండవది – గతుకుల నేలలో నడిచేటపుడు చెయ్యి కుదుపులని తట్టుకునేలా కర్రకి షాక్ అబ్జార్బర్స్ ఏర్పాటు చేసింది.



మూడవది – నున్నటి, తడి ప్రదేశాల్లో నడవటానికి వీలుగా ఒక లివర్ సహాయంతో పని చేసే రబ్బర్ వాక్యూమ్ కప్పులను ఊతకర్ర చివరన అమర్చింది. దీనివలన ఎంత త్వరగా నడిచినా ఈ కర్ర సంకలోనుంచి జారిపోదు, ఎంత గతుకుల బాటలోనైనా షాక్ అబ్జార్బర్స్ వుండటం వలన చేతిమీద పెద్దగా ఒత్తిడి పడదు. అదేవిధంగా ఊతకర్ర చివరన రబ్బరు కప్పులు వుండటం వలన నున్నటి తడి ప్రదేశంలో అవి అతుక్కుపోయి, జారి పడకుండా గట్టి పట్టును ఇస్తాయి. కావలసినపుడు లివర్ సహాయంతో గాలి వత్తిడిని తీసేసి, కప్పును ఎత్తే సదుపాయం ఏర్పాటు చేయబడింది.

నిత్య జీవితంలో దివ్యాంగులు ఎదుర్కొనే అతి ముఖ్యమైన సమస్యలకు జీవితాన్ని రక్షించే పరిష్కారాలు చూపిన దుర్గాదేవికి ఎన్.ఐ.ఎఫ్. వారు తమ 10వ జాతీయ స్థాయి గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలు 2019 లో రాష్ట్రస్థాయి పురస్కారంతో సత్కరించడం జరిగింది.

**ప్రోత్సాహక బహుమతి**

**అభివృద్ధి చేయబడ్డ 'సోనా-40' ఉల్లి రకం.**

పేరు : **బాబాసాహెబ్ నానాబాహు పిసోరె**

నివాసి : భీడ్ జిల్లా, మహారాష్ట్ర.



మహారాష్ట్ర లోని భీడ్ జిల్లాకు చెందిన 64 సం.ల బాబాసాహెబ్ ఆ ప్రాంతంలో పేరు ప్రఖ్యాతులున్న ఉల్లి రైతు. ఈయన ఉల్లి విత్తన ఉత్పత్తిలో నిష్ణాతుడు. ఈయన 2000 సంవత్సరంలో ఎంపిక పద్ధతిన ప్రయోగాలు ప్రారంభించి, ఎన్-2-4-1 రకాల నుండి పెద్ద సైజు గడ్డలు, ఆరోగ్యకరమైన మొక్కలు, త్వరగా పంటకు వచ్చే రకాల ఆధారంగా ప్రయోగాలు చేస్తూ 2005 నాటికి 'సోనా – 40' రకాన్ని రూపొందించి, స్థిరపరిచాడు.

త్వరగా పంటకు వచ్చే ఈ 'సోనా – 40' రకం ఉల్లి ఒకే గడ్డగా, ఎర్ర రంగులో, ఎక్కువ కాలం నిల్వ ఉండేవిగా ఉంటాయి. ఈ సోనా 40 రకాన్ని మహారాష్ట్ర, దఫోలి లోని డా. బాలాసాహెబ్ సావన్ కొంకణ్ కృషి విద్యాపీఠ్ సంస్థ వారు రెండు ప్రదేశాల్లో ప్రయోగాలు చేసి, రెండు ప్రదేశాలలో కూడా ఈ రకం మిగిలిన రకాలతో పోలిస్తే, ఉల్లిగడ్డ బరువుగా



ఉండటం, ఎక్కువ పొరలు ఉండటం, మంచి నాణ్యత, రంగు కలిగి వుండటము, చీడ పీడలను తట్టుకునే శక్తి కలిగి వుండటము గ్రహించి ధృవీకరించారు. అదే కాకుండా హెక్టారుకి 33 నుంచి 34 టన్నుల దిగుబడి (సాధారణ రకం కన్నా ఎక్కువ) ఇస్తుందని నిర్ధారించారు.

బాబాసాహెబ్‌కి మహారాష్ట్ర ప్రభుత్వం ఈయన ఉల్లిగడ్డల వ్యవసాయానికి చేసిన కృషిని గుర్తించి "కృషి భూషణ్" పురస్కారంతో సత్కరించింది. ఎన్ఐఎఫ్ వారు క్షేత్ర స్థాయి పరీక్షలలో ఈయన సహాయం చేసి, 12 రాష్ట్రాలలో ఈ విత్తనాన్ని వితరణ చేసి, పండించి, అన్ని చోట్ల నుంచి, ప్రత్యేకంగా రాజస్థాన్, మహారాష్ట్రల నుండి (నీటి తక్కువ ప్రదేశాలు) చాలా ఆశాజనక ఫలితాలను సేకరించింది. 2016 నుంచి గుజరాత్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్ మొదలైన అనేక రాష్ట్రాలలో సుమారు 13,600 కిలోల ఈ 'సోనా–40' రకం విత్తనాలను పంచటంలో సహాయం చేసింది. అంతే కాక, పిపివి & ఎఫ్ఆర్ చట్టం – 2001 ప్రకారం రిజిష్టర్ చేయటానికి ప్రక్రియ ప్రారంభించింది.

మంచి రకం, ఎక్కువ దిగుబడినిచ్చే నాణ్యత కలిగిన ఉల్లి 'సోనా – 40' రకాన్ని అభివృద్ధి చేసిన బాబాసాహెబ్‌కు ఎన్.ఐ.ఎఫ్. వారు తమ 10వ జాతీయ స్థాయి గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలు 2019 లో రాష్ట్రస్థాయి పురస్కారంతో సత్కరించడం జరిగింది.




వ్యవసాయానికి ఉపయోగించే నీటి కుంటలు (ఫాం పాండ్) లలో నీటి ఆవిరిని తగ్గించేందుకు ఒక పద్ధతిని కనిపెట్టారు అభ్యుదయ రైతు యం.యస్. సుబ్రహ్మణ్యం రాజు. వీరు గో ఆధారిత వ్యవసాయదారుల సంఘానికి ప్రధాన కార్యదర్శి. ప్రతి నీటి బొట్టు అమూల్యమైనదని, సాధారణంగా ఆవిరి రూపంలో వెళ్ళే నీటిని దాదాపు 70 శాతం వరకు అరికట్టడమే దీని ఉద్దేశ్యం. ఇదంతా కేవలం పర్యావరణ రహితంగా, ఎలాంటి వాణిజ్య ఉత్పత్తులు కొనవలసిన అవసరం లేకుండా, అన్ని ప్రాంతాలలో లభించే వస్తువులతోనే రైతులు తమంతట తామే చేసుకొనే పద్ధతి. వీరి ఆలోచనంతా ఇందులో వాడే పదార్థాలు నీటిలో కరగని, నీరు ఆవిరి అయ్యే ఉష్ణోగ్రత కన్నా బాగా ఎక్కువ ఉష్ణోగ్రత వద్ద ఆవిరి అయ్యే విధంగా ఉండాలి. అందుకోసం ఏదైనా వంట నూనె ఉపయోగించాడు. రైతు ఖర్చు తగ్గించుకునేందుకు ఒకసారి ఉపయోగించిన నూనె కూడా ఉపయోగించవచ్చు.

వంట నూనె ఏదైనా నీటిపైన తేలియాడుతుంది అన్న విషయం ఆందరికీ తెలిసిందే దీనికి కారణం వంట నూనెల సాంద్రత (0.92), నీటి సాంద్రత (1) కన్నా తక్కువ కావున ఇది నీటిపైన తేలియాడుతూ వుంటుంది. పైగా నీటిలో కరగదు. వంటనూనె ఆవిరిగా మారే ఉష్ణోగ్రత 120 డిగ్రీల సెల్సియస్ అయితే నీరు ఆవిరి అయ్యే ఉష్ణోగ్రత సుమారు 5 డిగ్రీల సెల్సియస్. నీరు ఆవిరి కావడం అనేది అనేక అంశాలపైన ఆధారపడి వుంటుంది. ఉష్ణోగ్రత, గాలి ఎక్కువగా వున్నపుడు నీరు ఎక్కువగా ఆవిరి అవుతుంది. దీనితో పాటు గాలిలో తేమ శాతం, వాతావరణ ఒత్తిడి వంటివి కూడా నీరు ఆవిరి కావటాన్ని ప్రభావితం చేస్తాయి.

ఈ విధానంలోని ప్రధాన సూత్రం నూనెలు నీటిపైన పలుచని పొరగా ఏర్పడి సూర్య తాపాన్ని (వేడిని) వెనక్కి మరల్చడం ద్వారా (పరావర్తనం) ఆ నూనె పొర క్రింద వున్న నీరు త్వరగా వేడెక్కదు కాబట్టి తక్కువ నీరు ఆవిరి అవుతుంది. ఇందుకోసం రైతులు ఆహారానికి ఉపయోగించే ఏదైనా నూనెను ఉపయోగించవచ్చు. నూనెలు మొక్కలకు హానికరము కాదు. పైగా దీనివలన మొక్కలకు అదనంగా పోషకాలు అందుతాయి. వ్యవసాయ నీటి కుంటలలో అక్కడక్కడా కొద్దిగా నూనె పోసినట్లయితే ఆ నూనె దానంతట అదే నీటిపైన అతి పలుచని పొరగా నీటిపైన తేలియాడుతూ పరుచుకు పోతుంది. ఇందుకోసం నీటి కుంటలో చదరపు మీటరుకు 25 మి.మీ.లకు తక్కువ కాకుండా నూనె పోయాల్సి వుంటుంది. అలాగే ప్రతి నెలా చదరపు మీటరుకు 13 మి.మీ. చొప్పున నూనె వేస్తూ వుండాలి.

ఈ నూనె వేయటంతో పాటు గాలిలోని తేమ, వాతావరణ పీడనంలను మనం నియంత్రించలేము కాబట్టి గాలి వేగాన్ని తగ్గించేందుకు నీటికుంట చుట్టూ ఎత్తైన చెట్లను పెంచాలి. ఇలా పెంచటం వల్ల ఉష్ణోగ్రతను కూడా కొంత

వరకు తగ్గించవచ్చు.

సూర్యుని వేడి సాధారణంగా మార్చి నుండి ఆగష్టు వరకు 35 నుండి 45 డిగ్రీల సెల్సియస్ వరకు, ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఇంకా ఎక్కువగాను వుంటుంది. నీరు ఆవిరి అయ్యే పరిమాణం రోజుకు చ.మీ.కు 5 మి.మీ. నుండి 15 మి.మీ. వరకు ఉంటుంది. అంటే సరాసరిన 10 మి.మీ. (1 సెం.మీ) నీరు ఆవిరి అవుతుంది.

హోటళ్ళు, రోడ్డు ప్రక్కల ఆహార పదార్థాలు తయారు చేసి విక్రయించుకునే వారి వద్ద ఒకటి రెండుసార్లు ఉపయోగించిన నూనె లీటరు 50 రూపాయల లోపే లభిస్తుంది. రైతులు ప్రతి వెయ్యి చదరపు మీటరుకు 25 లీటర్ల చొప్పున మొదటి నెల అంటే ఖర్చు సుమారు రూ. 1,250/-లు, తర్వాత నెల 13 లీటర్ల చొప్పున రూ. 650/-ల చొప్పున మార్చి నుండి ఆగష్టు వరకు 6 నెలలకు రూ. 4,500/-ల వరకు ఖర్చవుతుంది.

**సాదారణంగా నీటి కుంట నుండి రోజుకు నీరు ఆవిరి అయ్యే పరిమాణం ఈ విదంగా వుంటుంది :**

1.చ.మీ. x 100 సెం.మీ. లోతు - 1000 లీ. (1 ఘ.మీ. = 1000 లీ. నీరు)

1000 చ.మీ. x 100 సెం.మీ. లోతు - 10,00,000 లీటర్లు

1000 చ.మీ. x 1 సెం.మీ. లోతు - 10,000 లీటర్లు

1000 చ.మీ. x 1 మి.మీ. లోతు - 1000 లీటర్లు.

పైన తెలిపిన వివరాల ఆధారంగా 1000 చ.మీ. నీటి కుంట నుండి రోజుకు 10 వేల లీటర్ల చొప్పున 6 నెలలకు 18 లక్షల లీటర్ల నీరు ఆదా చేయవచ్చు. దీనికి అయ్యే ఖర్చు రూ. 4,500/-లు. అంటే ఒక్క రూపాయ ఖర్చుతో 400 లీటర్ల నీరు ఆవిరి రూపంలో వెళ్ళకుండా ఆదా చేసుకోవచ్చు.

ఇక్కడ రైతులు ఒక చిన్న విషయాన్ని గమనించాలి. సాధారణంగా నూనెను నీటిపైన పోసిన కొద్దిసేపటికే గాలి వల్ల నూనె మొత్తం ఏదో ఒక మూలకు వెళ్ళే అవకాశం వుంటుంది. కాబట్టి నీటిపైన తేలియాడే విధంగా ఒక వలను వేసినట్లయితే ఇలా నూనె పొర నీటి కుంటలో ఒక వైపుకు వెళ్ళకుండా చాలావరకు నియంత్రించవచ్చు.

సుబ్రహ్మణ్యం రాజు గారు ఆర్గానిక్ రైతు. తాను స్వయంగా చేయటమే కాక, సేకరించిన జ్ఞానాన్ని, చేసిన ప్రయోగాలను వాట్సాప్ - వెబ్‌సైట్ల ద్వారా దేశమంతా పంచుకుంటారు. వేలాది మంది రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఈ కార్యక్రమం చేపట్టారు. "హార్ట్" (హెల్త్, ఎడ్యుకేషన్, అగ్రికల్చర్, రూరల్ డెవలప్‌మెంట్, టూరిజం) సంస్థకు మేనేజింగ్ ట్రస్టీగా ఉన్నారు. ●

**సంప్రదించడానికి యం.యస్. సుబ్రహ్మణ్యం రాజు, ఫోన్ : 7659855588.**

# ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ (FPO) సభ్యులకు ఆహ్వానం

'పల్లెసృజన - క్రియేటివ్ మైండ్స్' **FPO** సభ్యుల కొరకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న "రైతుల కోసం రైతులు చేసిన గ్రాస్ రూట్స్ ఇన్నోవేషన్ల పై సదస్సు" ను ప్రతి నెలా నిర్వహించ బడుతున్నది. ఈ సదస్సులో రైతుల సమస్యలకు సరళమైన, అందుబాటులో వుండే యాంత్రిక పరిష్కారాలు, విత్తనాలు, మొక్కలు, పశు మరియు మానవ ఆరోగ్యానికి చెందిన సూచనలు, ఆయుర్వేద పురుగు మందులు లాంటి రైతులు ఆవిష్కరించిన జ్ఞానము..... ఇవన్నీ ప్రదర్శించబడతాయి. మీ సమస్యలను చర్చించి వాటికి పరిష్కారాలు సాధించటానికి ప్రయత్నాలు జరుగుతాయి. కావున ఈ సదస్సులు ఎఫ్.పి.ఓ. సభ్యులు, రైతులు అందరూ ఆహ్వానితులే.

సదస్సుకు రావాలి అనుకున్న వారు ముందుగా మీ పేరు నమోదు చేసుకో గలరు. కరోనా వైరస్ ప్రమాదం దృష్ట్యా కేవలం 30 మందికి మించకుండా పాల్గొన వచ్చు. మీరు మీ పేరు నమోదు చేసుకున్న తర్వాత మా తరుపున నిర్ధారించిన వారు మాత్రమే పాల్గొనాల్సి వుంటుంది. అందరి సహకారాన్ని కోరుతున్నాం.

సదస్సు నిర్వహించే స్థలము :

**'పల్లెసృజన' కార్యాలయము, ప్లాట్ నెం. 77, రోడ్ నెం. 3, వాయుపురి, సైనిక్‌పురి, సికింద్రాబాద్.**

**సమయం : ఉ. గం. 10-30 నుండి మ. 1-30 గం.ల వరకు.**

**వివరాలకు సంప్రదించండి : సుభాష్ చందర్, ఫోన్ : 9652801700**

# మీ సమస్య - పల్లెసృజన పరిష్కారం

**'పల్లెసృజన' తన కార్యక్రమాలు 16 సంవత్సరాల క్రితం ప్రారంభించింది.. ఎంతోమంది సమస్యలకు పునాది స్థాయి ఇన్నోవేటర్లు పరిష్కారాలను అందించారు. వాటివల్ల ఎంతోమంది తమకు లభించిన పరిష్కారంతో ఆర్థికంగా, శారీరకంగా, సమయపరంగా ఎంతో లాభం పొందుతున్నారు. ఇంతవరకు పల్లెసృజన అందించిన పరిష్కారాలను మీకు అందిస్తున్నాం.**

**- ఎడిటర్**

### 001. తెల్ల కుసుమల పూలను సేకరించే పరికరం

సమస్యను అందించిన వారు : **డైరెక్టర్, ఐఐఓఆర్ – ఐసిఎఆర్, హైదరాబాద్.**

ఇన్నోవేటర్ : **మహిపాల్ చారి. (2014)**

తెల్ల కుసుమ పంట పూర్తయిన తర్వాత రైతులు ఆ పంటను కోసి కుసుమల నూర్పిడి చేస్తారు. కానీ పంట కోయక ముందే ఈ కుసుమ కాయలపైన ఎండిపోయి వున్న కుసుమ పువ్వు (పూత) చాలా ఉపయోగకరమైనదని, దాన్ని సేకరించ గలిగితే కిలో 2–3 వేల వరకు రైతుకు లభిస్తుందని దీనికి కావలసిన యంత్రం లేదా పరికరం తయారు చేసి ఇవ్వమని డైరెక్టర్, ఐఐఓఆర్ – ఐసిఎఆర్, హైదరాబాద్ వారు 'పల్లెసృజన'కు తమ సమస్యను గురించి వివరించారు. ఈ సమస్యను ఇన్నోవేటర్లకు అందించగా ఇన్నోవేటర్ మహిపాల్ చారి దీనికి అతి సులువైన పరికరం తయారు చేసుకుని వచ్చి సమస్యను అందించిన వారికి చూపించగా, ఆ సంస్థ డైరెక్టర్ ఎంతో ఆశ్చర్య పోయారు. ఈ సమస్యకు తయారు చేసే యంత్రం ఎంతో ఖరీదైనదిగా వుంటుందని, దాన్ని ఎలా తయారు చేయించాలి అని మేము ఆలోచిస్తున్నాము. మీ ఇన్నోవేటర్ కేవలం మహిళలు ఇంట్లో వేడి గిన్నెలు దించటానికి వాడుకునే పటకారుతో ఈ సమస్యకు పరిష్కారం చూపారు. ఇంత సులభమైన పరిష్కారం చూపిన ఇన్నోవేటర్ మహిపాల్ చారిని అభినందించి, సత్కరించడం జరిగింది. అతి చౌకగా, గ్రామాల్లో లభ్యమయ్యే వస్తువులతో పరిష్కారం చూపటమే 'పల్లెసృజన' ఇన్నోవేటర్ల ధ్యేయం.



ఈ పరికరాన్ని దేశమంతా వ్యాప్తి చేసే బాధ్యతను ఐఐఓఆర్ – ఐసిఎఆర్ సంస్థలు చేపట్టింది.

### 002. చెరువులు, కాలువల్లో గుర్రపు డెక్క నిర్మూలన

సమస్యను అందించిన వారు : **టి. మధుసూధన్ రావు, పారిశ్రామికవేత్త, ఆంధ్రప్రదేశ్.**

ఇన్నోవేటర్ : **గోదాసు నర్సింహ (2013)**

ఆంధ్రప్రదేశ్ లోని కోస్టల్ ప్రాంతాల్లో వ్యవసాయ నీటి పారుదల కాలువలు, కెనాల్‌లు గుర్రపు డెక్కతో నిండిపోయి, నీరు పారటంలో ఎన్నో అవాంతరాలు ఎదురవుతున్నాయి, ఈ సమస్యకు పరిష్కారం చూపమని కోస్తా ప్రాంత పారిశ్రామిక వేత్త టి. మధుసూధన్ రావు గారు కోరటం జరిగింది. ఈ సమస్యకు మన ఇన్నోవేటర్ గోదాసు నర్సింహ ఒక యంత్రాన్ని



తయారు చేశాడు. స్వతహాగా చేపలు పట్టే వృత్తిలో వున్న గోదాసు నర్శింహకు గుర్రపు డెక్క వల్ల జరిగే నష్టాలు బాగా తెలుసు. అది నీటిపై తేలియాడుతూ వుంటుందన్న విషయం తెలిసి దాన్ని కేవలం బైట తీసి వేయటం కన్నా అది మళ్ళీ పునరుత్పత్తి కాకుండా నిర్మూలించాలని ఆలోచించి చేసిన పరిష్కారం ఇది. చెరువుల, కాలువలలోని గుర్రపు డెక్కను ఒక తాడు సహాయంతో గుంజి, ఇతను తయారు చేసిన యంత్రానికి అందించినట్లయితే ఆ యంత్రం గుర్రపు డెక్కను చిన్న చిన్న ముక్కలుగా చేసి బైటకు వేస్తుంది. ఈ ముక్కలైన గుర్రపు డెక్కను దూరంగా తీసుకువెళ్ళి వేయటం లేదా, ఎరువుగా మార్చుకోవటం జరుగుతుంది.

**003. సముద్రంలోకి ప్లాస్టిక్ వ్యర్థాలు వెళ్ళకుండా నివారించడం :**

సమస్యను అందించిన వారు: **విశాఖ పట్నం పోర్ట్ ట్రస్ట్**
పరిష్కరించిన ఇన్నోవేటర్ : **గోదాసు నర్శింహ (2019)**
**యంత్రం తయారు చేసి, సరఫరా చేయబడింది. త్వరలో దీని పని ప్రారంభమవుతుంది.**

**004. 'శ్రీ వరి' లో కలుపు నివారణ యంత్రం :**

సమస్యను అందించిన వారు : **సిహెచ్ఆర్కె. ప్రసాద్, యం.డి., ఎన్.ఓ.ఎఫ్.ఎ., విజయవాడ.**
పరిష్కరించిన ఇన్నోవేటర్ : **మహిపాల్ చారి (2016)**
**యంత్రం తయారు చేయబడింది. మార్కెట్లో విక్రయించబడుతోంది.**

**005. కీన్యాదేశానికి గుర్రపు డెక్కనిర్మూలన యంత్రం**

సమస్యను అందించిన వారు : **విదేశాంగ శాఖ, భారత ప్రభుత్వం.**
పరిష్కరించిన ఇన్నోవేటర్ : **గోదాసు నర్శింహ (2019)**
**కీన్యా దేశానికి యంత్రం చేర్చబడింది. దాన్ని బిగించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. కరోనా వల్ల కొంత సమయం పట్టవచ్చు.**

**006. వరిమడి గట్లపై (గెనాలపైన) కలుపు నివారణ:**

సమస్యను అందించిన వారు: **తెలంగాణ రైతులు.**
పరిష్కరించిన ఇన్నోవేటర్ : **ముప్పారపు రాజు (2020)**
**నమూనా పరికరం తయారు చేయబడింది. దాని పనితనం కూడా విజయవంతంగా నిరూపించబడింది. అమ్మకానికి సిద్ధంగా వున్నాయి.**

**007. నూనె విత్తనాలు గానుగలో వేసే ముందు ఎండబెట్టడానికి షెల్టర్ :**

సమస్యను అందించిన వారు: **న్యూ లైఫ్ ఫౌండేషన్.**
పరిష్కరించిన ఇన్నోవేటర్ : **ఆర్. షన్ముఖరావు (2020)**
**పరిష్కారం తయారు చేయబడింది. వినియోగదారులచే నిరూపించే ప్రక్రియ జరుగుతోంది.**

**008. పది ఎకరాల పొలానికి 50 అడుగుల లోతు నుండి పశువుల ద్వారా నీరు పారించే ప్రక్రియ :**

సమస్యను అందించిన వారు : **విజయరాం, సేంద్రియ వ్యవసాయదారుడు.**
పరిష్కరించిన ఇన్నోవేటర్ : **గోదాసు నర్శింహ (2020)**
**ఏర్పాటు చేయబడింది. త్వరలో పని ప్రారంభం అవుతుంది.**

**009 పోచంపల్లి టై & డై చేనేత పద్ధతిలో దారాలను బాబిన్ లకు చుట్టే పరికరం:**

సమస్యను అందించిన వారు : **పోచంపల్లి ఇక్కట్ చేనేత దారులు.**
పరిష్కరించిన ఇన్నోవేటర్ : **చింతకింది నరేందర్ (2020)**
**యంత్రం తయారు చేయబడింది. చేనేత దారులచే నిరూపించబడింది. తయారు చేసి సరఫరా చేస్తున్నారు.**

**010. జీవన ఎరువులు తయారు చేయుటానికి అందులో వేసే వ్యవసాయ వ్యర్థాలను చిన్న ముక్కలుగా కత్తిరించడం:**

సమస్యను అందించిన వారు: **విజయ కుమార్, కడప జిల్లా.**
పరిష్కరించిన ఇన్నోవేటర్ : **గోదాసు నర్శింహ (2018)**
**పరికరం చేయబడింది. ప్రస్తుతం ఉపయోగంలో వుంది.**

**011. సమూహాల కొరకు పప్పును తయారు చేసే యంత్రం:**

సమస్యను అందించిన వారు: **రాధాస్వామి సత్సంగ్.**
పరిష్కరించిన ఇన్నోవేటర్ : **గోదాసు నర్శింహ (2020)**
**నమూనా యంత్రం విజయవంతంగా ధృవీకరించ బడింది.**

**012. డిష్ వాషర్ (వంట పాత్రలు కడిగే యంత్రం):**

సమస్యను అందించిన వారు : **అరవింద్ ఎద్యుకేషన్ సొసైటీ, విజయవాడ.**
పరిష్కరించిన ఇన్నోవేటర్ : **షన్ముఖరావు (2018)**
**యంత్రం తయారు చేయబడింది. పనితనాన్ని ధృవీకరించడం జరిగింది.** ●

(వచ్చే సంచికలో మరికొన్ని సమస్యలు – పరిష్కారాలు)

# 'పల్లెసృజన' పాల్గొన్న వివిధ కార్యక్రమాలు



మార్చి 22న హైదరాబాద్ లోని 'సిఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఇంజనీరింగ్ విద్యార్థులు, రైతులకు'పల్లెసృజన' పునాది స్థాయి ఇన్నోవేషన్లను ప్రదర్శించడం జరిగింది.
ఇంజనీరింగ్ విద్యార్థులు, రైతులు ఈ సదస్సును ఎంతో ఉత్సుకతతో తిలకించారు.



ఫిబ్రవరి 06 న 'పల్లెసృజన' కార్యాలయంలో 5వ'రైతుల ఇన్నోవేషన్ల సదస్సు' కార్యక్రమం నిర్వహించ బడింది. ఈ వర్క్‌షాప్‌లో 17 మందికి పైగా రైతులు పాల్గొని ఇన్నోవేషన్లను ఉత్సాహంగా తిలకించారు.





'పల్లెసృజన' కార్యాలయంలో ఫిబ్రవరి 20 న 1వ "రైతుల కోసం రైతులు చేసిన గ్రాస్ రూట్స్ ఇన్నోవేషన్ల పై సదస్సు" నిర్వహించబడింది. ఈ సదస్సులో 'రైతు ఉత్పత్తి దారుల సంఘం' (ఎఫ్.పి.ఓ.) సభ్యులు 29 మందికి పైగా పాల్గొని ఇన్నోవేషన్లను గురించి అవగాహన చేసుకున్నారు.



మార్చి 8 న ఇన్నోవేటర్లను గురించి నిర్మిస్తున్న చలన చిత్రానికి "ఏవం జగత్" అని నామకరణం చేశారు. 'పల్లెసృజన' కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పద్మశ్రీ చింతకింది మల్లేశం బ్రిగేడియర్ పోగుల గణేశం గార్లు సినిమా టైటిల్‌ను ప్రారంభించారు.

'పల్లెసృజన' కార్యాలయంలో మార్చి 13 న 'రైతుల ఇన్నోవేషన్ల అవగహన' కార్యక్రమం నిర్వహించ బడింది. ఈ వర్క్‌షాప్‌లో 10 మంది యస్.యన్.వి.యం.వి. కళాశాల విద్యార్థులు, ఇద్దరు అధ్యాపకులు, 5 మందికి పైగా రైతులు పాల్గొని ఇన్నోవేషన్లను గురించి వివరాలు తెలుసుకున్నారు.





# జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి
రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## పెద్ద చెట్లు ప్రూనింగ్ చేసే యంత్రం

**సమస్య – పరిష్కారం :**

పండ్ల తోటలలో సాధారణంగా చెట్ల కొమ్మలను ప్రూనింగ్ చేయటం ద్వారా చెట్లు నియంత్రణ లేకుండా ఎత్తుకు పెరగకుండా, చెట్టు దట్టంగా వచ్చి కాపు ఎక్కువగా వచ్చి, ఫలాలు సులభంగా త్రెంచుకోవటానికి అనువుగా వుంటుంది. సాధారణంగా ఈ పని గొడ్డలి, చాకు, రంపాలతో చేస్తూ వుంటారు. ఈవిధానం కష్టతరమైంది, ఎక్కువ కూలీలు అవసరమౌతారు, పైగా ప్రమాదంతో కూడుకున్నది. వీటితో సరియైన రూపం రాకపోవటమే కాక, ఎక్కువ సమయం కూడా తీసుకుంటుంది. చాలా ఎత్తున్న కొమ్మలను ప్రూనింగ్ చేయటానికి ప్రత్యేకమైన నిచ్చెనల సహాయం తీసుకోవాల్సి వుంటుంది. వీటన్నిటికి పరిష్కారంగా రాజస్థాన్‌కు చెందిన గుర్‌మేల్ సింగ్ ధోన్సీ అనే రైతు ఒక ఆటోమేటిక్ ఎలక్ట్రో మెకానికల్ ప్రూనింగ్ యంత్రాన్ని తయారు చేశాడు.

**పరికరం :**

ట్రాక్టరుకు అనుసంధానం చేసే ఈ పరికరం ఎంత పెద్ద చెట్టునైనా ప్రూనింగ్ చేయటానికి ఉపయోగ పడటమే కాక, ఎత్తయిన కొమ్మలను కూడా కత్తిరించ గలదు. హైడ్రాలిక్ సిస్టం వుండటం ద్వారా పైకి క్రిందకి వెళ్ళటం సులభమౌతుంది.

**సాంకేతిక వివరాలు :**

- కనీసం 40 హార్స్‌పవర్‌ల సామర్థ్యం గల ట్రాక్టరుకు అనుసంధానం చేసే పరికరం.
- హైడ్రాలిక్ సదుపాయం కలదు.
- 15 కిలోవాట్ల హైడ్రాలిక్ మోటారుతో పని చేస్తుంది.
- మోటారు స్పీడు 1000 ఆర్‌పియం.
- ఇంటర్మీడియట్ షాఫ్ట్, 2000 ఆర్‌పియం.
- సెంట్రల్ షాఫ్ట్ 3000 ఆర్‌పియం.
- బ్లేడ్లు 4,200 ఆర్‌పిఎం.

**ముఖ్యాంశాలు :**

- 20 అడుగుల ఎత్తయిన చెట్టును కూడా ప్రూనింగ్ చేయగలదు.
- 20 అడుగుల వెడల్పున్న రోడ్డుకు ఇరువైపుల వున్న చెట్లను ఒకేసారి ప్రూనింగ్ చేసుకోవచ్చు.
- పండ్ల తోటల్లో 200 చెట్లను కేవలం ఒక గంటలో పూర్తి చేయవచ్చు.







❀ ట్రాక్టరు కదలకుండా వుండి చుట్టూ 10 అడుగుల వ్యాసంలో తిరుగుతూ చెట్లను ప్రూనింగ్ చేసుకోవచ్చు.

**పురస్కారాలు :**

❀ 2012లో జరిగిన ఎన్ఐఎఫ్ వారి 6వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో బహుమతి పొందారు గుర్మెల్‌సింగ్ ధోన్సీ.

## పొలాన్ని చదును చేసి అదనపు మట్టిని టిప్పర్‌లో నింపే యంత్రం

**సమస్య – పరిష్కారం :**

చదునుగా లేని వ్యవసాయ భూములలో పంట వేయటం కష్టం. సాధారణంగా వర్షాలకు భూమి కోసుకు పోవటం ద్వారా పొలాల్లో ఎత్తు పల్లాలు ఏర్పడుతాయి. అటువంటి సందర్భాలలో ఎక్కువైన, ఎత్తుగా వున్న మట్టిని త్రవ్వి తీసి, పొలంలో తగ్గు వున్నచోట కానీ లేదా బయట వేయాల్సి వుంటుంది. ఇది చాలా ఖర్చుతో కూడుకున్న పని. దీనికి చాలామంది కూలీలు, చాలా సమయం పడుతుంది. ఈ సమస్యకి పరిష్కారంగా పంజాబ్‌కు చెందిన 'కుల్దీప్ సింగ్ మరియు రేషమ్ సింగ్'లు వేరువేరుగా భూమిని త్రవ్వి టిప్పర్లోకి నేరుగా ఎత్తి పోసే యంత్రాలను రూపొందించారు. ఈ యంత్రాలతో పొలాలను చదును చేయటమే కాక, ఎక్కువగా వున్న మట్టిని టిప్పర్‌లోకి ఎత్తి తక్కువగా వున్నచోట వేయటం కాని, లేదా బయటకు తీసుకువెళ్ళి పడవేయటం కాని సులభంగా చేసుకోవచ్చు. రైతులకు ఎంతో సమయం, ఖర్చు ఆదా అవుతుంది.

**పరికరం :**

ఈ మట్టిని త్రవ్వి టిప్పర్‌లో నింపే పరికరం ట్రాక్టర్‌కు అనుసంధానం చేసుకోవాల్సి వుంటుంది. ఇది భూమిని త్రవ్వి కన్వేయర్ బెల్టు ద్వారా నేరుగా టిప్పర్‌లోకి పంపుతుంది. ఇందులో త్రవ్వే విభాగం కాకుండా రెండు కన్వేయర్ బెల్టులు








వుంటాయి. మొదటిది మట్టిని పైకి ఎత్తటానికి, ఎత్తిన మట్టిని టిప్పర్‌లోకి వేసేది రెండోది. ఇది ఒకసారి 4 అంగుళాల లోతువరకు భూమిని త్రవ్వగలదు.

**సాంకేతిక వివరాలు :**

- రెండు నిమిషాలలో 11-6-2.25 అడుగుల సైజు టిప్పర్‌ను మట్టితో నింపగలదు.
- 50 హార్స్‌పవర్ శక్తిగల ట్రాక్టర్‌కు దీన్ని అనుసంధానం చేసుకోవాల్సి వుంటుంది.
- గంటకి 5 నుండి 6 లీటర్ల డీజిలు ఖర్చవుతుంది.
- ఒకేసారి 4 అడుగుల వెడల్పులో, 4 అంగుళాల లోతు భూమిని త్రవ్వి తీసి 8.5 అడుగుల ఎత్తు నుండి టిప్పర్‌లోకి పడేయ గలదు.

**ముఖ్యాంశాలు :**

- కాలువలు త్రవ్వటానికి, రోడ్లు వేయటానికి, ఇళ్ళు కట్టడానికి ఎంతో అనువైన యంత్రం.
- సరాసరిన రోజుకి 150 టిప్పర్‌ల మట్టిని త్రవ్వి తీయగలదు.

**పురస్కారాలు :**

- 2013లో జరిగిన ఎన్ఐఎఫ్ వారి 7వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో బహుమతిని ఇన్నోవేటర్లు సంయుక్తంగా పొందారు.

**కావాలనుకున్నవారు సంప్రదించండి:**

పల్లెసృజన, ఫోన్ : 040-27111959,
సెల్ : 96528 01700 (సుభాష్ చందర్)

## సమస్యలకు ఆహ్వానం

'పల్లెసృజన' ఇంతవరకు సమాజంలోని సమస్యలకు తయారుగా వున్న పరిష్కారాలు (ఇన్నోవేషన్‌లను) వెతికి, వెలుగులోకి తీసుకు రావడానికి స్వచ్ఛందంగా గత పదిహేను సంవత్సరాలుగా ప్రయత్నాలు చేస్తున్నది. వాటివల్ల పునాది స్థాయి ఇన్నోవేటర్ల సృజనాత్మక శక్తి వెలుగులోకి రావటంతో పాటు, ఎంతోమందికి శారీరకంగా, ఆర్థికంగా, సమయం పరంగా ఎంతో లాభం చేకూరింది. అంతే కాక పునాది స్థాయి ఇన్నోవేషన్లు ఎన్నో అందుబాటులోకి రావటం, గ్రామాల్లోనే ఎంతోమందికి ఉపాధి లభించటం జరిగింది.

గత 16 యేళ్ళ ఈ ప్రయాణంలో పరిష్కారాలు వెతికిన అనుభవంతో సమాజంలో వున్న సమస్యలను కూడా వెతికి పల్లెసృజన కుటుంబంలో వున్న ఇన్నోవేటర్ల ద్వారా పరిష్కారాలు చేయిస్తే సమాజానికి ఇంకా లాభం చేకూరుతుందని భావించాం. ఈ ప్రయత్నంలో మీ సమస్యలను మీవద్దనుండి సేకరించాలని నిర్ణయించుకున్నాం.

గ్రామాల్లో మీరెవరైనా వ్యక్తిగతంగా లేదా నలుగురికీ సంబంధించిన ఏదైనా సమస్యకు పరిష్కారం వుంటే బావుంటుంది అనుకుంటున్నారా? అయితే అటువంటి సమస్యలను క్రింద ఇచ్చిన వాట్స్ యాప్ నంబర్లకి పంపగలరు. ఎన్ని సమస్యలైనా పంపవచ్చు. పరిష్కారాలను మా ఇన్నోవేటర్ల సహాయ సహకారాలతో వెతికే ప్రయత్నాలను, వాటి ప్రగతిని మీకు 'పల్లెసృజన' పత్రిక ద్వారా తెలియజేస్తూ వుంటాము. - **ఎడిటర్.**

వాట్స్ యాప్ నంబర్లు :

**బ్రిగేడియర్ గణేశం, 9866001678, సుభాష్ చందర్, 9652801700**



# ఇతర రాష్ట్రాల పల్లె జ్ఞానం

311201

**ఆకు ముడత తెగులు నివారణకు:**

ఆకు ముడత తెగులు అన్నది భారతదేశంలోని అన్ని ప్రాంతాలను, దాదాపు అన్ని రకాల పంటలను ఆశించే తెగులు. ఇది సాధారణంగా రసం పీల్చే పురుగు లేదా తెల్ల దోమ ద్వారా విస్తరించే తెగులు. దీనికి చాలా రకాల మందులు రైతులు వాడుతున్నా, గుజరాత్ రాష్ట్రం లోని రాజ్‌కోట్ జిల్లాలో విచియా తాలూకాలోని లాలవదార్ గ్రామానికి చెందిన చగన్ భాయ్ పంచ్ భాయ్ మెథాలియా అనే రైతు ఒక ప్రత్యేక పద్ధతి ద్వారా ఈ వ్యాధిని నియంత్రిస్తున్నాడు. దీనికి ఆయన మేక పాలు, నిమ్మకాయ రసం వాడుతున్నాడు. ముందుగా పురుగు మందు చల్లే స్ప్రేయర్ ట్యాంకులో ఒక లీటర్ మేక పాలు మరియు 14 లీటర్ల నీరు కలిపి ఈ మిశ్రమానికి 2-3 నిమ్మకాయల రసాన్ని జోడిస్తాడు. ఈ ద్రావకం పిచికారి చేయటం ద్వారా ఆకు ముడత వ్యాధి తాను ఎన్నో సంవత్సరాలుగా నియంత్రిస్తున్నానని చెప్తున్నాడు చగన్ భాయ్. మంచి ఫలితాలు రావాలంటే 6 రోజుల తర్వాత మరొకసారి ఇదేవిధంగా పిచికారి చేస్తే మంచిదని సలహా ఇస్తున్నాడీయన.



311203

**పంటలలో 'పేనుబంక' నివారణకు:**

కొన్ని రకాల పంటలకు పేనుబంక బెడద చాలా ఎక్కువగా వుంటుంది. దీనివల్ల రైతులు భారీగా నష్టపోతూ వుంటారు. దీని నివారణకు చాలామంది రైతులు చాలా పద్ధతులు వాడుతున్నా, గుజరాత్ రాష్ట్రం లోని జునాగడ్ జిల్లా, కేశోడ్ తాలూకా, పిప్లీ ప్రాంతానికి చెందిన 'కరంషీ భాయ్ వన్‌జీభాయ్ వన్‌ప్రియా' అనే రైతు ఈ పేనుబంక నివారణకి తనదైన శైలిలో ద్రావకం తయారు చేసుకొని వాడి, మంచి ఫలితాలు పొందుతున్నాడు. ఆయన చెప్పిన దాని ప్రకారం వాము - 100 గ్రా., గోమూత్రం - అర లీటరు తీసుకుని, అందులో 20 గ్రా. పొడి చేసిన ఇంగువ కలుపుకుని ఈ మిశ్రమానికి 75 లీటర్ల నీరు జోడించి, 8-10 రోజుల వరకు పులియబెట్టాలి. తరువాత ఈ మిశ్రమాన్ని వడకట్టి, నేరుగా పంటపై పిచికారి చెయ్యాలి. ఈ పద్ధతిని ఉపయోగించి తాను చాలా సంవత్సరాలుగా మంచి ఫలితాలు పొందుతున్నానని చెబుతున్నారు కరంషీ భాయ్.

ఈయన ఆ ప్రాంతంలో గత పది సంవత్సరాలుగా







సేంద్రియ వ్యవసాయం చేస్తూ తాను కనిపెట్టిన ఖర్చు తగ్గించే మార్గాలను, ఉత్పత్తి పెంచే మార్గాలను ఇతర రైతులతో స్వచ్ఛందంగా, ఏ లాభాపేక్ష లేకుండా పంచుకుంటూ వుంటాడు. కొత్తిమీర, ధనియాల పంటలో కలుపు నివారణకు ఈయన తనదైన శైలిలో తాను తయారు చేసి, ఉపయోగిస్తున్న పద్ధతిని నలుగురితో పంచుకుంటున్నాడు.

**311204 కలుపు నివారణకు:**

సేంద్రియ వ్యవసాయం చేసేవారు జీలకర్ర లేదా ధనియాలు పెరుగుతున్నపుడు కోతల తర్వాత కూడా ఈ కలుపు మొక్కలతో చాలా ఇబ్బందులు పడుతూ వుంటారు. దీనిని నియంత్రించటానికి 10 లీటర్ల గోమూత్రం, ఒక కిలో గోమయము, 250 గ్రా. పటిక బెల్లము, 50 గ్రా. క్యాల్షియం కార్బోనేట్, 5 లీటర్ల నీటిలో కలిపి ఈ ద్రావకాన్ని బాగా కలియదిప్పి, కొద్దిసేపటి తర్వాత ఈ ద్రావకాన్ని వడకట్టి కలుపు మొక్కలమీద పిచికారి చేస్తే మంచి ఫలితం వుంటుంది. ఇది పంట వేసే ముందు చేస్తే, పంటకి హాని చేసే కలుపు నివారణ సాధ్యమవుతుంది. ఈ ప్రక్రియ విత్తనాలు వేసే ముందు చేస్తే అద్భుతమైన ఫలితాలు వుంటాయి. ఎందుకంటే పంటకన్నా కలుపు త్వరగా పెరుగుతుంది. దానిని నివారించిన వాళ్ళమవుతాం. ఎట్టి పరిస్థితిలోనూ ఈ ద్రావకం పంటమీద పిచికారి చేయకూడదు. దీనివలన పంటపై దుష్ఫలితాలు వచ్చే ప్రమాదముంది. రసాయన కలుపు మందులు క్యాన్సర్ కారకాలు అంటున్నపుడు వాటి బదులు దీన్ని ఉపయోగించటం అందరికీ మంచిది.

**వెనిగర్, నిమ్మ మరియు బేకింగ్ సోడాలను వాడి సేంద్రియ వ్యవసాదారులు కలుపుని నివారించటం ప్రపంచమంతా చాలా కాలం నుంచి చేస్తున్నారు. - ఎడిటర్.**




**311205**

**రసం పీల్చే పురుగు మరియు ఆకుముడత పురుగు నివారణకు:**

ప్రతి రైతు తమ వ్యవసాయంలో ఎదుర్కొనే ప్రధాన సమస్య 'రసం పీల్చే పురుగు, ఆకు ముడత పురుగు'. ప్రత్యేకించి మిరప రైతులు ఈ సమస్య నుంచి సులభంగా బైట పడిన వాళ్ళు చాలా అరుదు. ఈ సమస్యకి తాను స్వయంగా తయారు చేసుకొని విజయవంతంగా ఉపయోగించిన పద్ధతిని వివరించాడు గుజరాత్ రాష్ట్రం లోని జునాగడ్ జిల్లా, కేశోడ్ తాలూకా, పిప్లీ ప్రాంతానికి చెందిన 'కరంషీ భాయ్ వన్‌జీభాయ్ వన్‌ప్రియా' అనే రైతు.

తన పద్ధతిని వివరిస్తూ ఆయన "మనం పెంచినవి కాకుండా, అడవి ఆముదము లేదా కొండ ఆముదము అని పిలువబడే చెట్టు ఆకులను 5 కిలోలు తీసుకొని, 20 లీటర్ల నీటిలో బాగా ఉడికించాలి. ఈ ద్రావకం 200 మి.లీ. తీసుకొని 15 లీటర్ల నీటిలో కలిపి పంటపైన పిచికారి చేసి మంచి ఫలితం సాధించానని చెబుతున్నాడు ఆయన.

ఆకుముడత నివారణకు తాను చేసిన మరొక ప్రయోగం గురించి చెబుతూ.... తాను పైన చెప్పిన ద్రావణంతో పాటు, గో మూత్రం, చెక్క కాల్చిన బూడిదను జోడించి పిచికారి చేస్తే ఆకుముడత పురుగు ఖచ్చితంగా నివారించ బడుతుందని చెబుతున్నాడు.

ఇదే ద్రావకాన్ని ప్రత్తి, మిరప ఇతర పంటలను ఆశించే తెల్లదోమ నివారణకు కూడా 200 మి.లీ. ద్రావకంలో 50 గ్రా. రాళ్ళ ఉప్పు, 15 లీటర్ల నీటిలో కలిపి పంటపై మొక్క మొత్తం బాగా తడిచేలా పిచికారి చేయాలి. ఇలా చేస్తే తెల్ల దోమను సమర్థవంతంగా నివారించవచ్చునట. ●



# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

స్వయంప్రతిపత్తి గల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము.

National Innovation Foundation-India



ఆకాశాన్ని అందుకోవాలన్న ఆశ....

## జాతీయ 13 వ ద్వైవార్షిక పోటీలు

**పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు**

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.) తన 12వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు గాను ఎవరి సహాయమూ లేకుండా రూపొందించిన పునాది స్థాయికి చెందిన సాంకేతిక ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞానం గురించిన దరఖాస్తులను కోరుతున్నది. ఈ ఇన్నోవేషన్లను రైతులు, కళాకారులు, చేతివృతుల వారు, జాలర్లు, మహిళలు వ్యక్తిగతంగా కాని, సామూహికంగా కాని పంపవచ్చు. మహిళలు, మురికి వాడల్లో నివసించే వారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, విద్యార్థులు, స్థానిక సమాజాలకి ప్రాధాన్యత ఇవ్వబడును. ఈ సృజనలు వ్యవసాయం (పనిముట్లు, యంత్రములు, కొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలైనవి), గృహోపకరణాలు, రవాణా, శక్తి (ఎనర్జీ), ఉత్పత్తి/ పరిరక్షణ, పని భారాన్ని తగ్గించటము, మూలికా వైద్యము (మానవులు మరియు జంతువులు) మొదలైన వాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని, ఎక్కువ కాలం మనగలిగి, పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆలోచనలు లేదా నమూనాలు బయటివారి సహాయము/ పర్యవేక్షణ లేకుండా తాము స్వంతంగా తయారు చేసినవై, ఇతరుల నుండి ఎటువంటి సాంకేతిక సలహాలు తీసుకోకుండా రూపొందించినవై ఉండాలి. మహిళల కొరకు మహిళలచే, వికలాంగుల కొరకు వికలాంగులచే రూపొందించబడిన ఇన్నోవేషన్లు, ఉత్తమమైన సాంకేతిక జ్ఞానానికి ప్రత్యేకమైన బహుమతులు ఇవ్వబడుతాయి.

ఉత్తమమైన వాటిగా గుర్తించ బడిన వాటిలో జాతీయ మొదటి **బహుమతిగా రూ. 5,00,000, జాతీయ రెండవ బహుమతిగా రూ. 3,00,000, జాతీయ మూడవ బహుమతిగా రూ. 1,00,000లను వివిధ వర్గాలలో ఇవ్వబడును.** జీవిత కాలపు సాఫల్యత పురస్కారం క్రింద రూ. 7,50,000లు గొప్ప ఇన్నోవేటర్‌కు లేదా ఇన్నోవేషన్లనే జీవితంగా ఏర్పరచుకొన్న వారికి ఇవ్వబడును. అంతే కాదు ప్రోత్సాహక బహుమతి క్రింది రూ. 10,000లను వివిధ వర్గాలలో ఎన్నుకోబడిన ఇన్నోవేషన్లు, సమాజ శ్రేయస్సుకు, పర్యావరణానికి తోడ్పడ్డ వాటికి ఇవ్వబడును.

ఇవే కాక పునాది స్థాయిలో సాంకేతిక విజ్ఞానాన్ని వెతికి వెలికి తీయటానికి దోహదపడిన వ్యక్తులు లేదా సంస్థలకు కూడా గుర్తింపు ఉంటుంది. అదేవిధంగా సాంకేతిక జ్ఞానం కలవారు, పునాది స్థాయిలో ఇన్నోవేషన్లను వెలికి తీయటానికి కృషి చేసిన ఎలక్ట్రానిక్/ ప్రింట్ మీడియా జర్నలిస్టులకి కూడా గుర్తింపు ఉంటుంది. ఈ దరఖాస్తులను **31 మార్చి, 2023** లోగా మాకు చేరేలా పంపండి.

SRISTI HONEY BEE NETWORK GIAN

**మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :**

**National Innovation Foundation,**
**C/o Gram Bharati, Amrapur, Gandhi Nagar-Mahudi Road, Gandhi Nagar, Gujarat-382 721.**
**Phone: (02764) 261131/32/ 38/ 39, Fax: (079) 26731903, Email: campaign@nifindia.org, Website: www.nif.org.in**

**సూచన :** వృత్తిపరమైన అనుభవం కలవారు లేదా వృత్తి కళాశాలలో చదువుకొనే విద్యార్థులు ఎన్.ఐ.ఎఫ్. నుండి ఏవిధమైన ఆర్థిక సహాయానికి కాని, పురస్కారాలకు కానీ అర్హులు కారని గమనించవలెను. అయినప్పటికీ అటువంటి వారు గ్రామస్థాయి ఇన్నోవేషన్లకి మెరుగు దిద్దినట్లయితే ఎన్.ఐ.ఎఫ్. వారిని గుర్తిస్తుంది. అర్హత వివరాలు, ఇతర మార్గదర్శకాలకై http://www.nif.org.in/announcement సంప్రదించండి. లేదా **'పల్లెసృజన' కార్యాలయాన్ని (ఫోన్ : 040–27111959)** సంప్రదించండి.




కాల, ప్రాంతాలకు అతీతంగా శాస్త్ర విజ్ఞాన జిజ్ఞాస మానవాళిని అంటిపెట్టుకునే వుంది. ప్రాచీన భారత దేశంలో విభిన్న రంగాలలో విశేష కృషి చేసిన మహనీయులు విజ్ఞానాన్ని బహు ముఖాలుగా విస్తరించే ప్రయత్నం చేసిన ఆలోచనాపరులు కోకొల్లలు. ఆర్యభట్టు, వరాహమిహిరుడు, చరకుడు, సుశ్రుతుడు, భాస్కరుడు మొదలైన వారు ఖగోళము, గణితము, వైద్యము లాంటి శాస్త్రాలలో తమ పరిశోధనల ద్వారా కొన్ని మైలురాళ్ళను సృష్టించారు. ఆ కోవలోకి చెందిన వారే 'సురపాలుడు'.

వృక్ష శాస్త్రంలో నిగూఢమైన విషయాలను ఎన్నింటినో పరిశోధించి, అపురూపమైన వృక్ష వైద్య రహస్యాలను గ్రంథస్తం చేసినవాడు సురపాలుడు. మొక్కల లక్షణాలు కూడా మానవుల శరీరాన్ని పోలి వుంటుందన్న శాస్త్ర పరిజ్ఞానాన్ని ఆవిష్కరించినవాడు సురపాలుడు. వృక్ష శాస్త్రంలో విశేషమైన కృషి చేసిన ఈ మహనీయుడి గురించిన సమాచారం ఇటీవలి వరకు మన దృష్టికి రానేలేదు. ఆయన రచించిన "వృక్షాయుర్వేదం" అన్న గ్రంథం ఇంగ్లాండులోని ఒక గ్రంథాలయంలో ఇటీవలే బయట పడింది. ఆ పుస్తక ఆంగ్లానువాదం 'ఏసియన్ అగ్రో హిస్టరీ ఫౌండేషన్ (ఎ.ఎ.హెచ్.ఎఫ్.), హైదరాబాద్ వారు **1996**లో ప్రచురించారు. దాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వృక్ష శాస్త్రం పట్ల ఆసక్తిగల ప్రతి ఒక్కరికీ – ముఖ్యంగా పరిశోధకులకు, విద్యార్థులకు, రైతులకు అందుబాటులోకి తీసుకు రావాలన్న ఉద్దేశ్యంతో 'ఐ–సర్వ్', హైదరాబాద్ వారు **2015** లో తెలుగు అనువాద ప్రక్రియకు ఉపక్రమించడం జరిగింది.

ఈ గ్రంథాన్ని 'పల్లెసృజన' పాఠకులకు అందించాలన్న సంకల్పంతో ఈ సంచికనుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం. ఈ గ్రంథంలోని మహత్తరమైన జ్ఞానాన్ని పాఠకులు అవగాహన చేసుకుని, ఆచరిస్తారని ఆశిస్తున్నాం. -ఎడిటర్.

**ప్రస్తావన**

1. విస్తృతంగా ఉద్యాన పంటలున్న ఈ భూమండలానికి (ధర్మబద్ధంగా) అధిపతి ఆయన.
   - ❀ పరస్పరం సంభాషించుకోవటం ద్వారా ఆనందాన్ని పొందే అవకాశాన్ని కలిగించే తోటలు ఇవి.
   - ❀ తమ సమ్మోహనాశక్తి అపారమైనదని అమితంగా గర్విస్తూ సుఖాల కోసం అర్రులు చాచే కాముక స్త్రీలకు అనంతమైన అనందాన్ని ఇచ్చే వివరాలు ఇవి.
   - ❀ చుట్టూ పరిభ్రమణం చేస్తున్న తేనెటీగలతో, పూర్తిగా వికసించిన తామర పువ్వులతో అలరారి విస్తారంగా పరుచుకుని వుండి మనోరంజకంగా వున్న పొడగాటి తటాకాలు కలిగినవి ఇవి.
2. యవ్వనము, ఆకర్షణీయమైన శరీరాకృతి, సౌందర్యము ఉట్టిపడే స్త్రీలు యోగ్యుడైన మిత్రుడు, శ్రావ్యమైన సంగీతం, దట్టమైన అడవులు – ఎన్ని వున్నా ఏం లాభం! ప్రసన్నత కోసం తాపత్రయపడే మహారాజుకు ఆహ్లాదకరమైన ఉద్యానవనం లేకపోతే!
3. మహాజ్ఞానులచే రచించబడిన శాస్త్రీయ గ్రంథాలు పఠించి, అవే అభిప్రాయాలను ఇక్కడ (ఈ పుస్తకంలో) ప్రతిపాదించాను. అయితే వాటిని సమన్వయ పరచడంలో నా వివేచనను ఉపయోగించాను తప్ప, యివేవీ నా స్వంతమైనవి కావు. దీన్ని దృష్టిలో వుంచుకొని సజ్జనులు ఈ నా రచనను చదివి (తమకు సహజమైన) ఆనందాన్ని అనుభవింతులు గాక.

4. ధర్మార్థాలకు సంబంధించిన ప్రయోజనం సమకూర్చని కుమారుల వల్లగానీ, అలాగే అడవిలో ఎన్నో రకాలైన చెట్లు పెరగడం వల్లగానే ఉపయోగమేమిటి? (వాటి బదులు) రహదారి ప్రక్కన ప్రజలు విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా ఒక్క చెట్టు ఉన్నా వాటికంటే ఎన్నో రెట్లు మేలు కదా!
5. పదిమంది కుమారులకు జన్మనివ్వడం కంటే అయిదు చెట్లను నాటడం గొప్ప. ఎందుచేతనంటే తండ్రికి (వాటిని నాటిన వాడికి) అవి ఆకులు, పూలు, పండ్లతో తర్పణం అర్పిస్తాయి.
6. పది బావులు ఒక కొలనుతో సమానము; పది కొలనులు ఒక చెరువుతో సమానము; పది చెరువులు ఒక కొడుకుతో సమానము; పది మంది కుమారుల వల్ల ఎంత ప్రయోజనమో, ఒక్క వృక్షము వల్ల అంత ప్రయోజనము కలుగుతుంది.
7. లెక్కకు మిక్కిలి పళ్ళతో అలరారే ఆహ్లాదకరమైన తోటను (ఇంకా ఎన్నో ప్రతిఫలాలనిచ్చే దానిని) పెంచితే, దేవతలు, విజ్ఞులు, వనదేవతలు, యక్షులు మున్నగువారు అక్కడ మూడు యుగాలు నివసిస్తారు.
8. ధర్మార్థ కామ మోక్షాలనే చతుర్విధ పురుషార్థాలను సాధించే మార్గాలు వృక్షాల వల్ల వెల్లడి అవుతాయి కాబట్టి, ఈ వాస్తవాన్ని గ్రహించి వృక్షాలను పెంచే పనికి ప్రతి ఒక్కరూ పూనుకోవాలి.
9. ఎన్ని రోజులయితే తాను నివసిస్తున్న ఇంట్లో తులసి మొక్కను పెంచుతాడో, ఆ వ్యక్తి అన్ని వేల సంవత్సరాలు వైకుంఠం (స్వర్గం) లో గౌరవింప బడతాడు.
10. సర్వేశ్వరుడికి అతి ప్రియమైన "బిల్వ" వృక్షాన్ని సరిగ్గా పెంచినట్లయితే, ధనలక్ష్మి అక్కడ శాశ్వత నివాసం ఉండి





తర్వాతి తరాలను కూడా కటాక్షిస్తుంది.

11. ఎక్కడైనా సరే, నిర్దేశించిన పద్ధతిలో ఒక్క 'అశ్వత్థ' వృక్షాన్ని నాటితే, ఆ నాటిన వ్యక్తి హరి నివసించే స్థలాన్ని చేరుకుంటాడు.
12. "ధాత్రి" (ఉసిరిక) నాటిన వ్యక్తి చాలా క్రతువులు నిర్వహించినట్లు. ఆయన భూమినే దానం చేసినట్లు. ఆయన ఎల్లప్పుడూ పవిత్రుడుగా, ప్రముఖుడుగా పరిగణింప బడతాడు.
13. రెండు మర్రి మొక్కలను నాటిన వాడు మహేశ్వరుని నివాసానికి వెళతాడు. అక్కడ చాలామంది వనదేవతలు ఆయన పరిచర్యలకు నియమింప బడతారు.
14. ధర్మ మార్గాన్ని కాచి వడబోసిన సర్వజ్ఞుడు వేపమొక్కను నాటి సూర్య భగవానుని చెంతకు చేరుకుంటాడు. ఆహా! అక్కడ చిరకాలం నివసిస్తాడు.
15. నాలుగు "పక్ష" (జువ్వి) చెట్లను నాటినవాడు నిస్సంకోచంగా రాజసూయ యాగ ఫలాన్ని అనుభవిస్తాడు.
16. అయిదు లేక ఆరు మామిడి చెట్లను నాటినవాడు గరుడుని నివాసం చేరుకుని, అక్కడ దేవతల లాగా సంతోషంగా జీవిస్తాడు.
17. ప్రతి ఒక్కరు ఏడు "ఫలాశ్మ" (మోదుగ) వృక్షాలను నాటాలి లేదా కనీసం ఒక్కటైనా. అలా చేస్తే, అతడు బ్రహ్మ నివాసం చేరుకుని దేవుళ్ళ సన్నిధిలో సంతోషాన్ని పొందుతాడు.

**(సశేషం)**

### టీవీ మెకానిక్ సిద్ధాంతం శ్రీనివాస రావు రూపొందించిన

# తక్కు ఖర్చుతో ఎక్కువ పని చేసే ఇసుక ఫిల్టర్



- పల్లె వీరరాఘవ రెడ్డి

పాశర్లపూడి లంక గ్రామం, మామిడి కుదురు మండలం, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఒక చిన్న కుగ్రామంలో సిద్ధాంతం బ్రహ్మం, రాజ్యలక్ష్మి దంపతుల కుమారుడు 49 సంవత్సరాల 'సిద్ధాంతం శ్రీనివాస రావు'. చదివింది కేవలం 10 తరగతి వరకు మాత్రమే. ఈయనకు భార్య శ్రీలక్ష్మి, ఇద్దరు కుమారులు. పెద్దబ్బాయి 10వ తరగతి, చిన్నబ్బాయి 8వ తరగతి చదువుతున్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల తాను చదువుకోలేక పోయానని, తాను కష్టపడుతూ తన ఇద్దరు పిల్లలను మంచి చదువు చదివించాలి అనుకుని వాళ్ళను మంచి పాఠశాలలో చేర్పించి చదివిస్తున్నాడు.

శ్రీనివాస రావుకు చిన్నప్పటినుంచే ఎలక్ట్రానిక్స్ పట్ల మక్కువ ఎక్కువ. కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా 10వ తరగతితో చదువు మానేసి వీరి తండ్రిగారి కులవృత్తి 'వడ్రంగి' కావడంతో శ్రీనివాస రావు వెంటనే తాను కూడా వడ్రంగి పనిలో తండ్రికి చేదోడు వాదోడుగా వుంటూ కొంతకాలం పని చేశాడు. తనకు చిన్నప్పటినుంచి ఎలక్ట్రానిక్స్ పట్ల మక్కువ వుండటంతో రాజమండ్రిలో టీవీ రిపేర్లు నేర్చుకోవటానికి వెళ్ళాడు. కొంతకాలం బాగా శిక్షణ తీసుకుని కాకినాడలోని ఓ టీవీ మెకానిక్ వద్ద ఉద్యోగం సంపాదించుకున్నాడు. అక్కడ కొంత కాలం ఉద్యోగం చేసిన తర్వాత తన స్వగ్రామానికి 4 కిలోమీటర్ల దూరంలో గల 'పాశర్లపూడి' ప్రధాన రహదారిలో తానే స్వంతంగా ఒక టీవీ రిపేర్ షాపు ఏర్పాటు చేసుకున్నాడు. దాదాపు 20 సంవత్సరాలుగా ఇప్పటికీ అదే షాపుపైన తన జీవనాధారం కొనసాగిస్తూ వున్నాడు. తాను మొదట షాపు తీసుకున్నపుడు నెలకు రూ. 300 అద్దె అయితే నేడు అదే షాపు అద్దె 3 వేల రూపాయలు. మారుతున్న టెక్నాలజీతో కొత్త కొత్త టీవీలు మార్కెట్‌లో వచ్చేకొద్దీ తాను కూడా నూతన టెక్నాలజీ నేర్చుకుంటూ ఆ ప్రాంతంలో మంచి పేరు సంపాదించు కున్నాడు.

స్వతహాగా సృజనాత్మకత కలిగిన శ్రీనివాస రావు తనకు ఖాళీ సమయం దొరికినప్పుడల్లా యూట్యూబ్‌లో కొత్త కొత్త పరికరాలు, యంత్రాలు, వాటి పని తీరు గమనిస్తూ



వుండేవాడు. ఎప్పుడు ఏ కొత్త యంత్రం లేదా పరికరం కనపడ్డా దాన్ని తదేక దృష్టితో చూసి అవగాహన పెంచుకుంటూ వుండేవాడు. ఈ క్రమంలో తాను టీవీ రిపేరు గురించి ఒకచోటికి వెళ్లినపుడు అక్కడ ఒక భవన నిర్మాణం జరుగుతుంటే ఆ భవనానికి సిమెంటు చేయటం కోసం కొంతమంది కూలీలు ఇసుకను జల్లి పడుతూ కనపడ్డారు. ఇసుకను సముద్రం లేదా నది నుండి నేరుగా తెచ్చి సిమెంటుతో కలిపి భవనానికి వెయ్యటం కుదరదు. దాన్ని అవసరమైనంత మేర జల్లి పట్టి ఆ ఇసుకలోని పెద్ద పెద్ద మట్టి ముద్దలు, ఆలుచిప్ప గవ్వలు, పెద్ద పరిమాణంలో వున్న రాళ్ళను వేరుచేసి మెత్తటి ఇసుకను మాత్రమే భవనానికి వినియోగించాలి. అలా జల్లి పడుతూ కొంతమంది కూలీలు పని చేయటం చూశాడు.

ఇసుకను జల్లి పట్టడానికి ఇంతమంది కూలీలను భవన నిర్మాణదారులు భరించాలి కదా, దీనికేదైనా ఒక చిన్న యంత్రం వుండదా అని ఆలోచించి, ఇంటికి వచ్చాక యూట్యూబ్‌లో అలాంటి యంత్రాలు ఏమైనా వున్నాయేమో అని వెతికి చూశాడు. కానీ తనకు అందులోని యంత్రాలు ఏవీ నచ్చలేదు. దీనికొరకు ఏదైనా యంత్రం తయారు చేయగలిగితే బావుంటుంది కదా అని ఆలోచించాడు. ఆ సమయంలో ఇక 'కరోనా' జబ్బు వల్ల ప్రపంచమంతా లాక్‌డౌన్ కావటంతో తనకు కూడా టీవీ రిపేర్ల వ్యాపారం లేక ఇంట్లో ఖాళీగా కూర్చోలేక ఈ ఇసుక జల్లి పట్టే యంత్రం గురించి కాగితంపై ఒక నమూనా గీసుకున్నాడు. తన ఆలోచనంతా తక్కువ ఖర్చుతో ఏ చిన్న గృహ నిర్మాణదారుడైనా సరే దాన్ని కొనుగోలు చేసి తన పనికి వినియోగించుకోవటంతో పాటు, ఇతరులకు కిరాయికి ఇచ్చి అదనపు ఆదాయం సమకూర్చుకునేలా వుండాలి. ఈ యంత్రం చిన్న గ్రామాల్లో అయినా సరే సులువుగా తీసుకు వెళ్ళి పని చేసుకోగలిగేలా వుండాలి అనుకుని తన నమూనా మొదలు పెట్టాడు.

ఎందుకంటే యూట్యూబ్‌లో వున్నవి అక్కడక్కడా పెద్ద పెద్ద పట్టణాల్లో వినియోగిస్తున్నవి, చాలా పెద్ద యంత్రాలు. వాటిలో చిన్నది అన్నా కూడా కనీసం ఒకటిన్నర రెండు హార్స్ పవర్‌ల ఇంజన్‌తో పని చేసేవిగా వున్నాయి. వాటికి ఎక్కువ కరెంటు పైగా త్రీఫేస్ కరెంటు అవసరం అవుతుంది. ఈ సమస్యలన్నీ తన యంత్రం తీర్చాలి అనుకున్నాడు. తాను గీసుకున్న నమూనాను వేరే వెల్డింగ్ పని చేసేవారి వద్దకు వెళ్ళి ఇలా చేసి ఇమ్మంటే అతను మరోలా చేస్తే కుదరదు కదా అనుకున్నాడు. తన మదిలో వున్న ఆలోచనను పూర్తిగా వెల్డింగ్ చేసే పనివారికి చెప్పటం కుదరదు. అందువల్ల 20 నుండి 30 శాతం వరకు తన ఆలోచన పని చేసే అవకాశం వుండదు. పైగా ఏ పని చేసిన నేనే స్వయంగా చెయ్యాలి అప్పుడే అనుకున్న విధంగా యంత్రం తయారు అవుతుంది అనుకునే మనస్తత్వం శ్రీనివాస రావుది. అందుకే తానే స్వయంగా ఒక వెల్డింగ్ యంత్రాన్ని కొని, అవసరమైన సామాగ్రి తెచ్చుకొని, తన యంత్రంపైనే వెల్డింగ్ పనిలో శిక్షణ తీసుకొని యంత్రం చేయటం మొదలు పెట్టాడు. ఈ వెల్డింగ్ పనిలో శిక్షణ తీసుకునే సమయంలో రెండు మూడుసార్లు తన చేతులు కూడా కాల్చుకోవటం జరిగిందని అన్నాడు శ్రీనివాస రావు. కేవలం 1/4 హార్స్‌పవర్‌ల మోటార్‌ను వినియోగించి మొత్తానికి తాను అనుకున్న యంత్రాన్ని పూర్త చేశాడు. కరెంటు పోయినా సరే అత్యవసర పరిస్థితి వుంటే ఒకటి రెండు గంటల వరకు ఇన్వర్టర్



కరెంటుతో కూడా ఈ యంత్రం పని చేస్తుంది. ఇందులో మూడు రకాల జాలీలను వినియోగించాడు. నదినుండి తెచ్చిన ఇసుకలో మట్టి గడ్డలు, రాళ్ళు, గవ్వలు వుంటే అవన్నీ యంత్రానికి ఒకవైపు, సిమెంటు చెయ్యటానికి అవసరమయ్యే కాంక్రీటు చెయ్యటానికి అవసరమయ్యే ఇసుక మరోవైపు వచ్చేలా యంత్రాన్ని తయారు చేశాడు. నిర్మాణం మొత్తం పూర్తయ్యాక గోడలకు సిమెంటు ప్లాస్టరింగ్ చెయ్యాలంటే ఇసుక ఇంకా కొద్దిగా సన్నగా వుండాలి. అటువంటప్పుడు ఒక జాలిని తీసివేసి, మరో జాలిని అమర్చుకోవడం ద్వారా మెత్తటి, సన్నటి ఇసుక క్రిందకు వస్తుంది. కూలీలు ఇసుకను కేవలం పిండి మరలో జొన్న, వరి లాంటి ధాన్యాన్ని వేసినట్లు పైన పోస్తూ వుంటే చాలు యంత్రం దాని పని అది చేస్తూ వుంటుంది. యంత్రం వద్ద మరో మనిషి వుండాల్సిన అవసరం లేదు. ఇలా మనకు అవసరమైన ఇసుకను మాత్రమే తీసుకునేలా జల్లి పట్టే యంత్రాలు మార్కెట్‌లో ఎక్కడా లేవు అంటాడు శ్రీనివాస రావు. మనకు అవసరమైన జాలిని మార్చటం కూడా కేవలం రెండు మూడు నిమిషాల పని మాత్రమే. అది కూడా చాలా సులభంగా మార్చుకోవచ్చు. కరెంటు కూడా కేవలం పావు హెచ్.పి. ఇంజనే కాబట్టి ఎక్కువ కరెంటు కూడా కాలదు. యంత్రం నుండి రాళ్ళు, గవ్వలు బైటకు వచ్చే భాగాన్ని కూడా మనకు అనువుగా అమర్చుకోవచ్చు. యంత్రం ఎక్కడికైనా తీసుకు వెళ్ళాలి అనుకున్నపుడు ఆ ద్వారాన్ని క్రిందకు దింపి తీసుకు వెళ్ళవచ్చు.





కేవలం తన ఆలోచన, శారీరక శ్రమతో ఇసుక జల్లిపట్టే యంత్రాన్ని చాలా తక్కువ ఖర్చుతో ఇంటి నిర్మాణానికి అనువైన ఇసుక జల్లి పట్టే యంత్రం తయారు చేసిన శ్రీనివాస రావు సృజనాత్మకత చాలా బావుంది అని ఆ యంత్రాన్ని వినయోగించుకున్న ఆ గ్రామస్తులు అతనికి కితాబునిచ్చారు. ఈ యంత్రం తయారు చేయటంలో ఎవ్వరి సహాయ సహకారాలు తీసుకోలేదు. కేవలం తన మేధా శక్తితో, శారీరక శ్రమతో తయారైందీ యంత్రం. ఆఖరుకు యంత్రానికి రంగులు కూడా తానే స్వయంగా వేసుకోవటం జరిగిందని ఆనందంగా చెపుతాడు శ్రీనివాస రావు.

యంత్రం మొత్తం తయారైన తర్వాత వారి గ్రామంలోని ఒకతనికి ఓ రోజు ఇసుక జల్లి పట్టే కూలీలు లభించలేదు, సిమెంటు చేసే మేస్త్రీలు మాత్రం వచ్చారు. ఇప్పుడెలా అనుకుంటున్న సమయంలో శ్రీనివాస రావు తయారు చేసుకున్న యంత్రం గుర్తుకు వచ్చి, ఇతన్ని ఆ యంత్రం ఇవ్వమని అభ్యర్థించాడతను. అందుకు శ్రీనివాసరావు కూడా సరే యంత్రాన్ని తాను బావుంది అనుకోవటం కాదు, ఇతరువు వాడిన తర్వాతే కదా అందులోని లోటుపాట్లు తెలుస్తాయి అనుకుని 'సరే వాడుకొని ఎలా పని చేస్తుందో చెప్పు' అన్నాడు. అతను ఆ యంత్రాన్ని మూడు రోజుల పాటు ఉపయోగించుకుని 'ఇది చాలా బాగా పని చేస్తుంది, ఈ విషయం ముందే తెలిసి దీన్ని ఉపయోగించుకుని వుంటే చాలామంది కూలీల ఖర్చు, శ్రమ తగ్గేది' అన్నాడట.

తాను ఈ యంత్రాన్ని తయారు చేసేటపుడు ఇంట్లో ఎవ్వరూ ఇతనికి ఆటంకం చెప్పలేదు. తన తండ్రికి తనపై గల నమ్మకంతో ఈ యంత్రం తయారు చేయటంలో ఎంతో నైతిక బలాన్ని అందించాడు. తాను పని చేసేటపుడు కూడా తన పెద్ద కొడుకు కాస్త చేదోడు వాదోడుగా వుండేవాడు. రోజంతా పని చేసి అలసిపోయి వుంటే మీరు విశ్రాంతి తీసుకోండి నాన్నా అంటూ అక్కడి సామానంతా తానే సర్దేసేవాడు అన్నాడు. తన కుటుంబం అంతా తనకు సహకరించారని, దీన్నెందుకు చేస్తున్నావు అంటూ నన్నెవరూ నిరుత్సాహ పరచలేదు అన్నాడు. ఈ యంత్రం తయారీ కన్నా కొన్ని సంవత్సరాల క్రితం తన ఇల్లు కట్టుకునేటపుడు ఇలా ఇసుక జల్లి పట్టేందుకు తానే స్వయంగా వాహనాలకు ఉపయోగించే వైపర్ మోటార్ సహాయంతో ఒక చిన్న డిసి యంత్రాన్ని తయారు చేసుకుని, తన ఇంటికి కావలసిన ఇసుకనంతా తానే స్వయంగా జల్లి పట్టుకున్నాడు.

తనకు ఈ యంత్రం తయారు చేయటానికి సుమారు 40 వేల రూపాయల వరకు ఖర్చయింది. కానీ దీన్ని తాను తయారు చేయాలంటే ఇంత ఖర్చవుతుంది కానీ, ఎవరైనా ఇప్పటికే తయారీ వృత్తిలో వున్నవారు చేస్తే కేవలం 20 వేల లోపే తయారవుతుందన్నాడు. వారు కొద్దిగా లాభంగా అమ్ముకున్నా 25 వేల లోపే ఈ యంత్రం విక్రయించుకోవచ్చు అన్నాడు. అలా ఎవరైనా తయారీదారులు ముందుకు వస్తే ఈ యంత్రం డిజైన్ మొత్తం ఇవ్వటానికి తాను సిద్ధమనీ, తన ఆలోచన పదిమందికి ఉపయోగపడి, తనకు ఎంతో కొంత డబ్బు ఇచ్చినట్లయితే ఈ ఆలోచనను ఇవ్వటానికి తాను సిద్ధమని అన్నాడు శ్రీనివాస రావు.

ఈ యంత్రం తయారు చేయాలనుకున్న ఔత్సాహికులు ఎవరైనా ముందుకు వస్తే 'పల్లెసృజన' మధ్యవర్తిత్వం వహించి ఈ యంత్రం నమూనా ఆలోచనను ఇప్పించటంలో తన పూర్తి సహకారాన్ని అందిస్తుంది. ఈ యంత్రాలు పెద్దయెత్తున తయారై చిన్న తరహా గృహ నిర్మాణాల వారికి ఉపయోగ పడితే చాలు అన్నది పల్లెసృజన మరియు ఇన్నోవేటర్ సిద్ధాంతం శ్రీనివాస రావు ఆలోచన. ఈ యంత్రానికి పేటెంటు హక్కులు ఇప్పించేందుకు 'పల్లెసృజన' తన సహకారాన్ని అందిస్తుంది.

**ఇన్నోవేటర్ సిద్ధాంతం శ్రీనివాస రావు ఫోన్ : 9849790554**

## పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం

**దేశవ్యాప్తంగా పునాదిస్థాయి ఇన్నోవేటర్లు (గ్రామీణ శాస్త్రవేత్తలు) తయారు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన 'పల్లెసృజన' కార్యాలయంలో ఏర్పాటు చేయడమైనది. ఈ ప్రదర్శనను పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, రైతులు సందర్శిస్తున్నారు. రైతులు ఈప్రదర్శనను చూస్తే వారికి అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని లాభకరంగా వినియోగించుకునే అవకాశం లభించటంతో పాటు, దేశీయ జ్ఞానానికి చేయూతను అందించిన వారవుతారు.**

**మీ సమస్యలను పల్లెసృజనతో చర్చించవచ్చు.**


సోలార్ సెల్ ఛార్జర్


వివిధ రకాల శుభ్రపరిచే సేంద్రియ ద్రావణాలు


శ్రీశైలం

హైదరాబాద్ వచ్చినపుడు 'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక దర్శించండి. ముందుగా మా కార్యాలయానికి సందేశాన్నిస్తే మీ సందర్శనను అర్థవంతంగా చేస్తాం.

'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :
**77, రోడ్ నెం. 3, వాయుపురి,**
**సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ – 500 094.**
**ఫోన్ : 040-27111959, సెల్ : 96528 01700.**
ఇ-మెయిల్ : boddu.subhash4@gmail.com
గూగుల్ మ్యాప్‌లో 'పల్లెసృజన' అని వ్రాస్తే మార్గం మీకు చూపిస్తుంది

# ఆయుర్వేద జ్ఞాన మథనం

# 'వడదెబ్బ' నుండి కాపాడుకోవటమెలా?



'వడదెబ్బ' అనేది ఒక్కోసారి చాలా ప్రమాద కారిగా కూడా మారుతుంది. దీనికి గురైన తర్వాత జాగ్రత్తలు తీసుకోవటం కంటే వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవటం మంచిది. ఇది పిల్లల నుండి వృద్ధుల వరకు ఎవ్వరికైనా ప్రాణాంతకంగా మారే అవకాశముంది. మానవ జీవితంలో శరీరంలోని క్రియలన్నీ ఒక నిర్ణీత ఉష్ణోగ్రతలో జరుగుతూ వుంటాయి. దాన్ని సమ శీతోష్ణ స్థితిలో వుంచేది 'మెదడు'. వాతావరణంలో ఒక్కోసారి ఉష్ణోత్రగతలు పెరిగినా, తగ్గినా వాటి నుండి శరీరాన్ని కాపాడే ప్రక్రియ మన శరీరంలో వుంటుంది. అవి ఎక్కువ తక్కువ కాకుండా మన వంతుగా కూడా కొన్ని జాగ్రత్తలు పాటించాలి.

వడదెబ్బ తగిలినప్పుడు దాని లక్షణాలు ఎలా వుంటాయి అంటే 'తలనొప్పి, నీరసం, అధిక జ్వరం, కళ్ళు మూతలు పడటం, నరాలు పటుత్వాన్ని కోల్పోవటం, నోరు పొడిబారటం' లాంటి కొన్ని మనకు కనబడతాయి. ఇవి ఎండకు తిరిగినంత మాత్రాన రావు, ఒక్కోసారి కొందరికి ఎండలో తిరగకుండా ఇంట్లో వున్నా సరే వడదెబ్బ తగిలే ప్రమాదముంది. పై లక్షణాలను బట్టి వడదెబ్బ తగిలింది అని నిర్ధారణకు చేసుకోవచ్చు.

వడదెబ్బ తగిలినప్పుడు ముందుగా శరీరాన్ని చల్లని నీటిలో మెత్తటి బట్టను అద్దుకుని వళ్ళంతా తుడిచి శరీరం చల్లబడేలా చేసుకోవాలి. వీలైతే నీటిలో తల, చేతులు, కాళ్ళు తప్ప మిగతా శరీరమంతా నీటిలో మునిగి వుండేలా కొద్దిసేపు చేసుకుంటే మంచిది. ఇలా చేయటం వల్ల శరీరంలోని వేడి మొత్తం నీటిలో కలిసి పోతుంది. ఆ తర్వాత ఉప్పు, పంచదార కలిపిన నీరు, మజ్జిగ, నిమ్మరసం లాంటి వాటిని చల్లగా సేవించాలి. ఇలా చేయటంతో వడదెబ్బ వల్ల శరీరం కోల్పోయిన లవణాలన్నిటిని తిరిగి శరీరానికి అందజేస్తాయి. ఎందుకంటే వడదెబ్బ వల్ల శరీరంలోని అవసరమైన లవణాలన్నీ బయటకు వెళ్ళిపోతాయి. ఇలా జరగటం వల్ల మనిషి నీరసమైపోతాడు. అవకాశముంటే బార్లీ, సగ్గుబియ్యం, గుమ్మడికాయ రసం, పండ్ల రసాలు లాటి వాటిలో తేనె కలిపి సేవిస్తే మంచిది. వీటిలో ఏదైనా ఒకటి రెండు పాటిస్తే చాలు, అన్నీ చేయాల్సిన అవసరం లేదు. మీకు వీలైనవి చేస్తే చాలు. ఇంకా కలబంద గుజ్జు – తేనె, ఉల్లిపాయ రసం – తేనె కలిపి కూడా సేవించవచ్చు. వట్టివేళ్ళు, గంధం కలిపి వంటికి రాసుకున్నా వడదెబ్బ తగలదు, ఒకవేళ తగిలినా త్వరగా తేరుకుంటారు. సమీపంలో అరటి చెట్లు వున్నట్లయితే వాటి నీడలో కాసేపు కూర్చున్నా వడదెబ్బ నుండి త్వరగా కోలుకుంటారు, వాటి నీడలో వున్నట్లయితే వడదెబ్బ తగిలే అవకాశాలు కూడా చాలా తక్కువ. సుగంధాలు, మంజిష్ట, అతి మధురం లాంటి వాటిని నీటిలో కలుపుకుని త్రాగినా మంచిదే. ఇందులో కొద్దిగా పటిక బెల్లం కలుపుకుంటే ఇంకా మంచిది.



సాధారణంగా ఎండాకాలం వచ్చిందంటే చాలా మందికి ఉక్కపోతగా వుంటుంది. అందువల్ల శరీరంపై దురదలు, చెమట గుల్లలు లాంటివి వచ్చి ఇబ్బంది పెడుతూ వుంటాయి. ఇలాంటప్పుడు వేపచెట్టు చెక్కను గంధంలా అరగదీసి శరీరానికి రాసుకుంటే మంచిది. లేదా ఆయుర్వేద దుకాణాల్లో 'మహా మాదికాయ తైలం' లభిస్తుంది. దాన్ని తెచ్చుకుని శరీరానికి పైపూతగా రాసుకున్నా త్వరగా ఉపశమనం లభిస్తుంది. వీలైనంత వరకు తేలిగ్గా అరిగే పదార్థాలు తీసుకోవాలి.

ఈ రెండు మాసాలు గ్రీష్మ తాపం ఎక్కువగా వుంటుంది కాబట్టి రెండు పూటలా స్నానం చేస్తే మంచిది. వేపుళ్ళు, ఎక్కువగా కారం తగ్గించి 'సలాడ్స్' వాడితే మంచిది.



ఎండదెబ్బ తగిలిన వాళ్ళకు శరీరంలో నీరు తగ్గటం వల్ల ఈ ప్రభావం కిడ్నీలపైన పడుతుంది. అందువల్ల కిడ్నీ సమస్యలు కూడా వచ్చే ఆస్కారం వుంటుంది కాబట్టి ముందు జాగ్రత్తగా టమాటా, బీట్‌రూట్, క్యారెట్, మామిడి కాయలు, పుచ్చకాయలు, ద్రాక్ష లాంటి వాటిని తగినంత తీసుకుంటూ వుంటే మంచిది.

చాలామంది వడదెబ్బకి, మూత్ర పిండాలకి ఏమి సంబంధం అనుకుంటూ వుంటారు. కానీ, ఎండదెబ్బ వల్ల మూత్ర పిండాల (కిడ్నీ) పై చాలా ప్రభావం వుంటుంది అన్న విషయం మర్చిపోకూడదు. ఎండదెబ్బ వల్ల శరీరంలో నీటి శాతం తగ్గినప్పుడు అది కిడ్నీలపై ప్రభావం చూపుతుంది. కాబట్టి ఈ సమస్యకు పరిష్కారం నీళ్ళే. మధుమేహం (చక్కెర వ్యాధి) వున్న వారు ఎక్కువగా ఎండలో తిరగకుండా వుంటేనే మంచిది. ఒకవేళ తిరిగినా నీరు అధికంగా సేవించటం ఉత్తమం. ఊబ కాయం వున్నవాళ్ళు, మూత్రనాళం ఇన్‌ఫెక్షన్ వున్నవాళ్ళు ఈ జాగ్రత్తలు ఎక్కువగా తీసుకోవటం మంచిది. కుటుంబంలో కిడ్నీ సమస్యలు ఎవరికున్నా, కుటుంబ సభ్యులందరూ ఈ జాగ్రత్తలు పాటించటం మంచిది.

కొంతమంది తెలిసీ, తెలియక ప్రతిరోజూ నొప్పుల కొరకు, అలర్జీ కొరకు మాత్రలు, డాక్టరు సలహా లేకుండా 'యాంటీ బయాటిక్' మాత్రలు వేసుకుంటూ వుంటారు. అలాంటి వారికి ఎండాకాలం కిడ్నీ సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువ. శరీరానికి శ్రమ లేకుండా కేవలం తిని కూర్చుంటూ వుండే వారు కొందరుంటారు. అటువంటి వారికి కూడా ఎండకాలంలో కిడ్నీ సమస్యలు వచ్చే ఆస్కారాలు ఎక్కువ. కాబట్టి పని వున్నా, లేకున్నా కాస్త లేచి అటూ ఇటూ తిరుగుతూ వుండటం మంచిది. కిడ్నీకి మంచి మందు నీళ్ళే. నీళ్ళు ఎక్కువగా తీసుకోవటం, మూత్రం ఎక్కువగా పోయటం వల్ల కిడ్నీ సమస్యలనుండి మనల్ని మనం కాపాడుకోవచ్చు. కాబట్టి ప్రతి ఒక్కరూ రోజూ కనీసం రెండున్నర – మూడు లీటర్ల వరకు నీటిని సేవించటం మంచిది. రోజులో రెండు లీటర్ల వరకు మూత్ర విసర్జన గనుక చేయగలిగితే కిడ్నీ సమస్యలు దరిచేరవు, వడదెబ్బ కూడా తగలదు.

ఈ ఎండాకాలం పోయే వరకు పాలకూర, సోయా, మునక్కాయలు, టమోట – పాలకూర కలిపి వండిన పదార్థాలు లాంటి వాటిని తక్కువగా తీసుకోవటం మంచిది. అరటికాయ కూర, పచ్చళ్ళు, అరటి పళ్ళు, నిమ్మరసం, కాకర, పైనాపిల్, కొబ్బరినీళ్ళు, బార్లీ గంజి, ఉలవలు లాంటివి ఉపయోగించటం వల్ల వడదెబ్బ నుండి కాపాడుకోవచ్చు. గుట్కా, మసాలాలు, మద్యం వీలైనంత వరకు తక్కువగా తీసుకుంటే మంచిది.

కాబట్టి వడదెబ్బ తగిలిన తర్వాత నివారణకు బాధ పడేకన్నా, రాకుండా జాగ్రత్తలు తీసుకోవటం ఉత్తమం. ●

**గమనిక :** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

**'వైద్య' ఉమా మహేశ్వర రావు ఫోన్ నెం. : 94402 86854**

## ఎన్.ఆర్.ఐ. లకు విన్నపము

ప్రతి గ్రామంలో ఎన్.ఆర్.ఐ. (నాన్ రెసిడెంట్ విలేజర్స్) ఉంటారు. ఉద్యోగ రీత్యా లేదా వ్యాపార రీత్యా తమ గ్రామానికి దూరంగా స్థిరపడిన వారు చాలామంది తమ గ్రామం పట్ల మక్కువ వున్నవారై వుంటారు. అటువంటి వారు తమ గ్రామం కోసం ఏదైనా ఒక మంచి పని చేయాలన్న తపన కలిగిన వారు కూడా వుంటారు. అటువంటి వారు కేవలం రూ. 1,000/–లతో 5 సంవత్సరాల పాటు గ్రామానికి ఒక మంచి పుస్తకాన్ని అందిస్తే మీకు మంచి పేరు రావటంతో పాటు, మరుగున పడివున్న ఎన్నో ఇన్నోవేషన్లు వెలుగులోకి వస్తాయి, మరెన్నో ఇన్నోవేషన్లను గురించిన సమాచారం మీ గ్రామానికి చేరి, వారు వినియోగించుకునే సదుపాయం కలుగుతుంది.

మీ గ్రామం నుండి వెలుపల జీవనం సాగిస్తున్న మీ మిత్రులకు ఈ విషయం తెలియజేయండి. వారు 'పల్లెసృజన' పత్రికకు చందా పంపి, ఈ పత్రిక మీ గ్రామానికి వచ్చే ఏర్పాటు చేస్తారు.

చందా వివరాలు ఈ పత్రిక చివరి కవర్ పేజీలో ఇవ్వటమైనది. వీలైనన్ని ఎక్కువ గ్రామాలకు పత్రిక వెళ్ళేందుకు సహకరించాల్సిందిగా కోరుతున్నాము.

– ఎడిటర్

# 'పల్లెసృజన' సంకల్పము

సైన్స్‌ను అభిమానించే వాడిగా, శాస్త్రీయ స్వభాగం, ఆవిష్కరణల పట్ల నాకున్న ఉత్సుకతతో మన 'పల్లెసృజన' కోసం ఈ పాటను వ్రాస్తున్నాను. దయచేసి వీలైతే ఈ పాటను మన పత్రికలో ప్రచురించ గలరు.

సృజన సృజన సృజన సృజనా
సృజన సృజన సృజన సృజనా
పల్లె పిల్లలా – ప్రాణాలై
గ్రామ ప్రజల – గ్రానైటై0
సర్కారు చిల్డ్రన్స్ – బ్రతుకు బండై
స్వప్నాన్ని సానెట్టి – సరీ క్రొత్తను వెలికి తీసే
సంకల్పానికి సమాధానమే సృజన.

**– ధనంజయ. బత్తా,** పల్లచూరు గ్రామం, పెల్లకూరు మండలం, నెల్లూరు జిల్లా.

**ధనంజయ గారికి,**

మీరెంతో అభిమానంతో పల్లెసృజనపై పాట వ్రాసి మాకు పంపినందుకు కృతజ్ఞతలు. పల్లెసృజన వాలంటీర్‌గా సమాజంలోని క్రియాశీలతను వెతికి, బయటకు తీసి, పదిమందికి లాభం చేకూరేలా చేయటానికి కృషి చేయండి. పిల్లల్లో, పెద్దల్లో, మహిళల్లో, వృద్ధుల్లో వున్న జ్ఞాన సంపదను ప్రస్తుత సమాజంలోని సమస్యలకు పరిష్కారంగా చూపగలుగుతామన్న ధ్యేయంతో 'పల్లెసృజన' ప్రయాణంలో మాకు మీరు తోడు కావాలని మనసారా ఆశిస్తున్నాము. **– బ్రిగేడియర్ గణేశం.**

## FORM IV

***Statement about ownership and other particulars about newspaper (PALLE SRUJANA) to be published in the first issue every year after the last day of February***

| | | | |
|---|---|---|---|
| 1. | Place of publication | : | **102, Vayupuri, Sainikpuri Post,** Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Teelangana |
| 2. | Periodicity of its publication | : | **Bi-Monthly** |
| 3. | Printer's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | Indian |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 4. | Publisher's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 5. | Editor's Name | : | **J. Seshi Mohan** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 2-1-513/2, Nallakunta, Hyderabad - 500 044. |
| 6. | Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | | |

I, **P. GANESHAM**, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date28-02-2017

**Signature of Publisher**

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

# పల్లెసృజన

www.pallesrujana.org

## అమ్మకానికి సిద్ధంగా వున్న రైతుల కోసం రైతుల

# ఇన్నోవేషన్లు

## పోర్టబుల్ పంపుసెట్



వర్షాభావ పరిస్థితుల్లో నీటియెద్దడి నుండి పంటను కాపాడుకునేందుకు పొలాల్లో మొక్కలకు నీరు పోయటానికి, గృహ నిర్మాణాల్లో 'క్యూరింగ్' చేయటానికి, ఇతర అవసరాలకు ఎంతో అనువైనది ఈ పోర్టబుల్ పంపుసెట్. పెట్రోలు సహాయంతో పని చేస్తుంది. 50 అడుగుల లోతునుండి నీటిని లాగి, 500 అడుగుల దూరం సునాయాసంగా నీటిని తోడగలదు. తక్కువ బరువున్న ఈ పోర్టబుల్ పంపుసెట్ ఎక్కడికైనా వెళ్ళేందుకు ఎంతో అనువైనది.

## పేడతో కుండీలు, దుంగలు, పిడకలు





ఆవులు, గేదెల పెంపకం దారులు వాటి పేడతో హోమంలో ఉపయోగించే పిడకలు, నర్సరీలలో ఉపయోగించే పూల కుండీలు, శ్మశాన వాటికల్లో కర్రకు బదులుగా ఉపయోగించటానికి దుంగలు తయారు చేయటానికి పరికరాలు మావద్ద సిద్ధంగా ఉన్నాయి. ఆవు, గేదెలనుండి లభ్యమయ్యే పేడను ఉపయోగించుకొని ఈవిధమైన పేడ ఉత్పత్తులతో గ్రామాల్లో అదనపు ఆదాయం పొందవచ్చు. ఈ పరికరాలు ఇద్దరు వ్యక్తులు, అతి తక్కువ కరెంటుతో పని చేస్తాయి.

## జొన్న రొట్టెలు, చపాతీలు చేసే యంత్రాలు



ఇవి మూడు మాడళ్ళలో లభిస్తాయి. పని సామర్థ్యతను బట్టి, అనుకూలతను బట్టి మీకు కావలసిన మాడల్‌ను ఎన్నుకోవచ్చు. ❀ స్టెయిన్‌లెస్ స్టీలు బాడీ ❀ యంత్రం బరువు మాడల్‌ను బట్టి 12 నుండి 70 కిలోల వరకు బరువుంటాయి. ❀ విద్యుత్తు వినియోగం 'సింగల్ ఫేస్', 8–10 గంటలకు ఒక యూనిట్. ❀ తయారీ సామర్థ్యం మాడల్‌ను బట్టి 30 నుండి 500 వరకు రొట్టెలు/ గంటకు ❀ రొట్టె మందం అవసరాన్ని బట్టి మార్చుకోవచ్చు ❀ ప్లేటు సైజు 9–10 అంగుళాలు ❀ యంత్రం బరువు మాడల్‌ను బట్టి 15–70 కిలోలు ❀ ఒక సంవత్సరం వారంటీ.

## శ్రీతైలం






శ్రీతైలం వాడక ముందు చక్కెర వ్యాధి గల ఒక వ్యక్తి కి అయిన గాయం



శ్రీతైలం వాడిన మూడు వారాల తర్వాత గాయంలో మార్పు

ప్రకృతిలో లభించే మూలికలతో తయారు చేయబడిన "కండరాలు, కీళ్ళ నొప్పులు, గాయాలు, దోమల నివారణ" అన్నిటికీ పనిచేసే ఒకే ఒక్క అద్భుత ఔషధం. శరీరంలోని అన్ని రకాల నొప్పులు, చర్మ వ్యాధులు, కాలిన గాయాలు, పుండ్లకు ప్రత్యేకించి మధుమేహం (షుగర్) రోగులకు ఏర్పడే పుండ్లను కూడా ఇది సమర్థవంతంగా తగ్గిస్తుంది. దోమల నివారిణిగా కూడా పని చేస్తుంది.

పరికరాలు కావలసిన వారు సంప్రదించండి :

బి. సుభాష్ చందర్, ఫోన్ : 9652801700

PALLE SRUJANA Telugu Bi-monthly March - April 2021 RNI No. TELTEL 2012/74620

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

**ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే**




పల్లెసృజన చందాదారులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. చందాదారులుగా చేరాలనుకున్నవారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ.లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.

**Pay by "Phone Pe" to 9866 00 1678**

**QR code for Phone Pe**

Scan & Pay Using PhonePe App

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27111959, సెల్ : 8125799904, 9866 00 1678
E-mail : president@pallesrujana.org Visit us : www.pallesrujana.org

### చందా వివరాలు

| వివరములు | వ్యక్తిగతం |
|---|---|
| రెండు సంవత్సరాలకి | 400/- |
| ఐదు సంవత్సరాలకి | 1,000/- |

లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి.
మీ చిరునామాను స్పష్టంగా మాకు వ్రాసి పంపండి లేదా యస్.యం.యస్. లేదా ఇ-మెయిల్ చేయండి.

**M/s Pallesrujana, Canara Bank, Sainikpuri, Secunderabad.**
**SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023**

లేదా 'ఫోన్ పే' చెయ్యాలనుకున్న వారు 9866 00 1678 నెంబరుకు పంపి మీ చిరునామా ఎస్ఎంఎస్ లేదా వాట్స్‌యాప్‌లో పంపండి.

Narendra Grafix, Ph.: 8125799904